ప్రతిమ

(భాసకృతికి నాంధ్రీకృతి)

ఆంధ్రీకర్త:

విద్వాన్ యడవల్లి ఆదినారాయణ, ఎం. ఏ.

ప్రాచ్యభాషాశాఖ, హిందూకళాశాల,

మచిలీపట్టణము

మూల్యము :

రూపాయి ముప్పావుల

ప్రథమ ముద్రణము మే, 1954.

హిందూ ప్రెస్, మచిలిపట్టణము

*

* *

అప్రతిమసుధీ, కావ్యశిల్పాధినేత
భాససత్కవి ప్రతిభావిభాసిమైన
సర్వసౌందర్యరాశి నా శక్తి కొలది
తెనుగు 'ప్రతిమ' ను జేసితి దివ్యానమేయి

* *

*

ఇందలి పాత్రలు

పురుషులు

సూత్రధారుడు :

రాజు :— దశరథుడు

రాముడు :— నాయకుడు - దశరథుని పెద్దకుమారుడు

లక్ష్మణుడు :— సుమిత్ర కుమారుడు

భరతుడు :— కైక కుమారుడు

శత్రుఘ్నుడు — సుమిత్ర కుమారుడు

సుమంత్రుడు :— దశరథుని మంత్రి

రావణుడు :— లంకా ప్రభువు

కాంచుకీయుడు :—

సూతుడు :— భరతుని సారథి

దేవకులికుడు :— ప్రతిమాగృహ రక్షకుడు

సుధాకరుడు :— సున్నము వేయువాడు

ముసలి తాపసులు :— రావణ జటాయువు యుద్ధము వర్ణింతురు

తాపసుడు :

నందిలకుడు :— తాపసుని సేవకుడు

[illegible] :

స్త్రీలు

నటి :

సీత :

కౌసల్య :
సుమిత్ర :
కైక :
} దశరథుని భార్యలు

అవదాతిక :— సీత సఖి

చేటి :— సీత పరిచారిక

ప్రతిహారి :— ద్వార రక్షకురాలు

విజయ :
నందినిక :
} కైక పరిచారికలు

తాపసి

ప్రతిమ



[నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించి]

సూత్రధారుడు :—

భావిత ధీసుమంత్ర పరి
వర్ధితుడుఁ భరతుండు జానకీ
భావుకసంవిధాతృడు ప్ర
పన్న విభీషణమానసుండు సు
గ్రీవనుతాభిరాము డురు
కీర్తియు నప్రతిమ ప్రభావుడున్
రావణవిద్విషుండు సహ
లక్ష్మణుఁడోముత సర్గసర్గముఁ.

(తెరపై పుజూచి) ఇదుగో! ఇల్లు రా కొంచెము!

నటి:— (ప్రవేశించి) ఆర్య! వచ్చుచున్నాను.

సూత్ర :— ఆర్యా! ఇప్పుడు శరత్కాలము గూర్చి పాడుము.

నటి :— ఆర్య! అట్లే! (పాడును)

* కలచు దుర్దినమేఘ సంఘమ్ము తొలఁగ
నమలినాకాశ రాజ్య పట్టాభిషిక్తుఁ

* ఇది మూలమున లేదు.

జంద్రముని మించి యాశరత్నమయ మందుఁ
బ్రథమగణనీయు డన్యు డెవ్వాండు గలడు!

సూత్ర:- ఈ సమయమున
కుశసుమాంశుక వాసిని కోర్కి మీర
చెలగి చరియించు హంసితాపులినములను.

(తెరలో)

అయ్యో! అయ్యో!

సూత్ర :- (విని) ఆ! తెలిసినది
ద్వారపాలిక యెలమి నంతఃపురాన
నాతురతమీర చరియించు నట్టి రీతి.

(నిష్క్రమింతురు)

(ఇది స్థాపన)

ప్రతిమ

ప్రథమాంకము

ప్రతీహారి :- (ప్రవేశించి) అయ్యా! కాంచుకీయులలో నిక్కడెవ్వ దున్నాడు?

కంచు :- (ప్రవేశించి) అమ్మా! ఏమిచేయవలెను ?

ప్రతీ :- అయ్యా! సురాసురరణముల నడ్డులేనిరథసంచారము గల దశరథమహారాజుగా రిట్లాజ్ఞాపించు చున్నారు. "వెంటనే రాచబిడ్డ యైన రామచంద్రునకు రాచఱికపు శోభను గూర్చి పట్టాభిషేకము చేయవలయును. దానికి వలయుసన్నాహము చేయవలెను" అని.

కంచు :- అమ్మాయీ! రాజుగా రాజ్ఞాపించిన దంతయు సమకూర్పబడియే యున్నది. చూడు!

వింజామరల నొప్పు వెలిగొడుగును మంగ
ళారావముల గద్దెయలరు నచట
దర్భలు పూలు తీర్థాంబువు లిండారు
పసిడిపాత్రలు నుంప బడియె నచట

క్రొంగ్రొత్తశిల్పాల గోరి నిర్మించిన
పుణ్యరథ మ్మట బోల్పెసంగు
సచివాళితోగూడి సర్వపౌరాసీక
మెనలేని ముద మొందు గనుము సభను

పూజ్యు లిక్ష్వాకుకులగురు లూర్ణకాము
లదె వసిష్ఠులు వేదిపై నలరినారు
రామచంద్రాభిషేకసంరంభమునను
సర్వశోభన మగు నేత్రపర్వముగను.

ప్రతి :- అటయిన శుభమే.

కంచు :- (హర్షమున) ఆహా!

రాముపట్టాభిషేక మిా రాజ్యమునను
చంద్రు నభిషేకమే యౌను సర్వధరణి
ఇపుడు దశరథసంకల్ప మిట్లు కలుగ
నిలను ధన్యులుఁ బూర్ణకాములును ప్రజలు.

ప్రతీ :- అయ్యా! ఇక నాలసింపకు! వేగిరపడు.

కంచు :- అమ్మాయీ! ఇదిగో త్వరపడుచున్నాను. (నిష్క్రమించును)

ప్రతి :- (ముందునకు బోయి చూచి) ఆర్యా! సంభవకా! సంభవకా! పొమ్ము "నీవుకూడ మహారాజుగారి యాజ్ఞ ప్రకారము పురోహితుని సగౌరవముగా తొందర పెట్టుము. (ఇంకొకవైపు పోయి) సారసికా! సంగీత శాలకుపోయి నటకులకు తెలుపుము. "ఈ సమయోచిత

మైన నాటకమును సిద్ధముచేయవలసినది''అని. నేనును పోయి సమస్తమును సంసిద్ధమే యని మహారాజుగారితో విన్నవించుకొందును. (నిష్క్రమించును)

(అవదాతిక నారబట్టతో ప్రవేశము)

అవదాతిక :- అయ్యో! అపచారము, నవ్వులాటలకు కొని పోవుచున్నను, నా కేమో యీ మాత్రముననే భయ మగుచున్నది. దొంగతనమే చేసినచో నిక చెప్పవలసిన దేమి? నవ్వు చున్న ట్లుండెద. ఒంటరిగా నవ్వినను బా గుండదు. ఎట్లమ్మా!

(పరివారముతో సీత ప్రవేశము)

సీత :- ఒసీ! అవదాతిక భయపడు చున్నట్లు పెట్టిన దేమి మొగము?

చేటి :- అమ్మా! దాసీజనమునకు దోసగులు తప్పవుగదా! తప్పే దేని చేసియే యుండును.

అవ :- (దరిజేరి) జయము భట్టిని! అమ్మా! నేను దోషిణి గాను.

సీత :- ఎవ రనిరి నిన్ను? అవదాతికా! అదేమి ఎడమ చేతిలో!

అవ :- అమ్మా! ఇదా? ఇది- నార-చీర.

సీత :- నారచీరా! ఎచ్చటి నుండి తెచ్చితివి?

అవ :- అమ్మా! వినుము : రంగమున నలంకారములు కాపాడునే ఆయమ్మ రేవాదేవి ప్రయోగము పూర్తి

చేసినది, రంగమున నుపయోగింపగా మిగిలిన అశోకముచివురుటాకొకటి మే మడిగితిమి. కాని, ఆమె యీయలేదు. అందుచే నామె యీతప్పిదమునకు దీనిని హరించితిని.

సీత :- పొమ్ము! తప్పు చేసితివి. పోయి యిచ్చివేయుము.

అవ :- లే దమ్మా! నవ్వులాటకు తీసికొని వచ్చితిని.

సీత :- వెఱ్ఱిదానా! ఈ దోషమే పెద్ద దవును. పొమ్ము! ఇచ్చివేయుము. ఇచ్చివేయుము.

అవ :- అమ్మా! అట్లే చేయుదును.

సీత :- ఒసీ! ఇటు రమ్ము:

అవ :- అమ్మా! వచ్చుచున్నాను.

సీత :- నాకుమాత్రి మిది ఎందుకు బా గుండదు?

అవ :- అమ్మా! చక్కనివారు చిక్కనను బా గుండు. అసలందమే యున్న నే దైనను మెరుగీయగలదు. అమ్మా! కట్టుకొనుడు.

సీత :- అయిన నేదీ యిటు తీసికొనిరమ్ము. (పుచ్చుకొని, లోనికిపోయి కట్టుకొని వచ్చి) ఏమే! ఇప్పుడు బాగుగ నున్నదా?

అవ :- మీకు 'బాగుగ నున్నదా' ఏమమ్మా! బాగే మమ్మా! బంగారమువలె నున్నది.

సీత :- ఏమే నీ వేమియు మాటాడ వేమి?

చేటి :- అమ్మా! ఏమి మాట్లాడగలను? మాట లేమి చెప్ప గలవు? ఈ నా శరీరము పై గగుర్పాటు చూడుము. తెలియును (అని చూపును)

సీత :- చెలీ! కొంచెము అద్దము తీసికొనిరా!

చేటి :- అమ్మా! చిత్తము (పోయి వచ్చి) అమ్మా! ఇదిగో అద్దము.

సీత :- (చేటిముఖమువంక జూచి) అద్దమును అటులే యుంచు. నీ వేమో చెప్పదలచుచున్నట్లున్నది?

చేటి :- అమ్మా! ఏమియు లేదు. నేను ఇది వింటిని. పూజ్యు లైన బాలాకి అనే కంచుకి చెప్పుచున్నాడు. "అభిషేకము అభిషేక"మని.

సీత :- ఎవ రైనా రా జగుదు రేమో!

(ఇం కొకతె ప్రవేశము)

చేటి :- అమ్మా! మంచిమాట మంచిమాట.

సీత :- ఏమే అది ఏమి? దగ్గరకువచ్చి చెప్పుము.

చేటి :- రాజకుమారున కభిషేక మట!

సీత :- పూజ్యు లైన తండ్రి కుశలులై యుండగనే

చేటి :- మహారాజుగారే అభిషేకింతు రట!

సీత :- అయిన నాకు రెండవ సంతసకారణము. ఒడి పెద్దది చెయ్యి.

చేటి :- అమ్మా! అట్టులనే (అట్లుచేయును)

సీత :- (ఆభరణములు తీసి, కానుక యిచ్చును)

చేటి :- అమ్మా! ఏమో దప్పుల మ్రోతవలె నున్నదే!

సీత :- ఆ! అదే.

చేటి :- ఒక్కమాటుగ తూర్యనాదము లాగిపోయినవే!

సీత :- అభిషేకమున కేమియు ఆటంక ముండదు కదా!
వివిధ సన్నివేశసంకులముగదా రాజగృహము!

చేటి :- అమ్మా! నే నిట్లు వింటిని "రామచంద్రులకు పట్టము
గట్టి మహారాజు గా రరణ్యము వెళ్లుదు రట.

సీత :- అయిన నిది అభిషేకోదకము కాదు; కన్నీ రగును.

(రాముడు ప్రవేశము)

రాము :- అహో!

చెలగగ దూర్యనాదములు,
చేరిముదంబున గాంచ బెద్దలున్
నిలువగ రాచగద్దియను
నేను, శిరమ్మున బైడిపాత్రలం
జలము దొరంగ, భర్తయె వి
సర్జన సేయగ, నే జెలంగ, దా
దలికిర యెల్ల, రబ్బుర మొ
కో యిటు పుత్రుడు తండ్రి వింటయున్.

'నాయనా! అభిషేకము వలదు' అని ప్రభువు తానై
విసర్జింపగా పెద్దబరువు తొలగినట్లు నే సంతసించితిని.
అదృష్టవశమున నే నా రాముడనే. మహారాజే మహా
రాజు. మైథిలిని జూతును.

అవ :- అమ్మా! రాకొమరులు వచ్చుచున్నారు. నారచీర కట్టుకొనియే యుంటి రింకను మీరు!

రామ :- మైథిలి! కూర్చుంటి వేమి ?

సీత :- ఆ! ఆర్యపుత్రుఁడా! ఆర్యపుత్రునకు జయము.

రామ :- మైథిలి! కూర్చుండుము.

సీత :- చిత్తము. (కూర్చుండును)

అవ :- అమ్మా! రాకొమరులు మునుపటివలెనే ఉన్నారే! అసత్యమా మనము విన్నది ?

సీత :- అట్టివా రసత్య మేల తలతురు ?

రామ :- (సీతను జూచి) ఏమి యనుచున్నావు ?

సీత :- ఏమియు లేదు. ఇది 'అభిషేకము, అభిషేకము' అనుచున్నది.

రామ:- నీ కోరిక తెలిసినది. అవును. అభిషేకమే. వినుము. గురుమంత్రిజనసమక్షమున కోసలరాజ్యము నేకముగా జేసి నేడు మహారాజు శైశవము నుండి అలవాటైన యొడిని నన్ను జేరిచి "కౌసల్యానందన! కుమార రామ! రాజ్యము గ్రహింపుము" అనెను.

సీత :- అప్పుడు మీ రేమంటిరి ?

రామ :- జానకి! నీ వే మంటి వను కొందువు?

సీత :- "ఏమియు మాట్లాడకుండ పెద్దగా నిట్టూర్చి, తాత పాదములపై బడి యుందు" . రనుకొందును.

రాము :- లెస్సగ నాలోచించితివి. ఏకశీలు రగు దంపతుఁ నరుదుస్పృజించును గదా సత్ప్రష్ట! అప్పుడు పాదములపై బడితిని. నిజమే.

ఎఱఁగుచు తచ్చరణయుగళి
నఱిముఱి నే కడిగినాడ నశ్రుజలమునన్
ఎఱగిన నా మస్తకమున
ముఱియుచు తా గురిసె దండ్రి మోదజలంబున్.

సీత :- తరువాత! తరువాత!

రాము :- ఎంత చెప్పినను రాజ్యస్వీకరణమున కియ్యకొనని నన్నుజూచి వార్ధకమునన్నున్న తనజీవితమ్ముపై నొట్టిడెను.

సీత :- తరువాత !

రాము :- అప్పుడు,

ఇమ్ముల మధ్యమాంబసుతు
లిద్వురు సేయ జలాభిషేకమా
త్రమ్మున దండ్రి ఛత్రము క
రమ్మున బట్ట ముదశ్రుపూర్ణుడై
అమ్మయి వచ్చి మంథ రెదొ
క్ష్మాధిపు కర్ణము లందు నూదె, రా
జ్యమ్మున కేను కానయితి
నంతట, రాజును జూచి రెల్లరున్.

సీత :- సంతసము. మహారాజుగారే మహారాజు. ఆరం పుత్రు డార్యపుత్రుడే.

రాము :- జానకి! తొడవు లేల ధరింపవు?

సీత :- లేదు. ఇప్పుడే ధరించెదను.

రాము :- ఇప్పుడే తీసియుండవచ్చును.

త్వరమెయి నూడ్చుట న్నగల
వంకర లైనవి కర్ణపాశముల్
కరతలయుగ్మ మిట్టులను
కందెను లాగుట కంకణావళుల్
బరువున మున్ను నీ యవయ
వంబులు వంగిన వట్టియున్నవి
ప్పరుసన భూషణాదికవి
వర్జితగాత్రి సమంచితంబులై.

సీత :- అసత్యమునుగూడ సత్యముగా తలపగల రార్యపుత్రులు!

రాము :- అటయిన నలంకరించుకొనుము. నే నద్దము పట్టుదును. (అట్లు చేసి చూచి) ఉండుము, సరిగా నుండుము.

అద్ద మందున వల్కలా లట్లు తనరు
నివ్వి దినకరుకాంతులా యేమి చెపుమ?
కాదు నారలె నవ్వితి కాన తెలిసె.
కట్టితివి వీని, క్రీడయా? ఘననియమమ?
అవదాతిక! అది యేమి?

అవ :- అయ్యా! బా గుండునో లేదో యని నవ్వుటాలకు కట్టుకొని రమ్మనగారు.

రాము :- జానకి! ఇది యేమి! ఇక్ష్వాకువంశజులు ముదుసలులై ధరించు వీని నిప్పుడే నీవు ధరించుచున్నావు? నాకును నిష్టమే. ఇటు తెమ్ము.

సీత :- వలదు, వలదు. ఆర్యపుత్రు లమంగళము పలుకవలదు.

రాము :- మైథిలి! ఎందులకు నివారించెదవు?

సీత :- 'పట్టాభిషేకము తొలగింపబడిన ఆర్యపుత్రుని కివి శుభావహములు కావేమో' అని తోచుచున్నది.

రాము :- నవ్వుల కాడితిగా, నీ
విన్విధమున బాగుల నేల నిందుముఖీ! నే
ని వ్వల్కలముల మున్నే
యెవ్వలన ధరించినాడ నీ వర్థమకాన్.

(తెరలో)

అయ్యో! అయ్యో! మహారాజు! హా!

సీత :- ఆర్యపుత్ర! ఇది యేమి!

రాము :- (విని)

ధ్వని యిది స్త్రీపురుషులయది
యనవధికము స్పష్ట మాచు నార్తికృత మ్మా
తన కెదురే లే దని విధి
జనపతినే త్రుంచినట్లు శంకింతు మదిన్.

త్వరగ నటు విని తెలిసికొందము.

(ప్రవేశించి)

కంచు :- రక్షింపుము. కుమార! రక్షింపుము.

రా :- ఆర్యా! ఎవరి రక్షింపవలెను?

కం :- మహారాజుగారిని.

రాము:- ఆర్యా! మహారాజునా ? ఏకరూపముగా చేయబడిన రాజ్యమునా రక్షింపవలయుట? అయిన నీ యపరాధ మెవరివలన?

కంచు :- స్వజనమువలననే.

రా :- స్వజనమువలననే? అయ్యో! తిరుగు లేదు.

తనువుమాత్రమె తాకు శాస్త్రవుని హేతి
హృదయమర్మమ్ము భేదించు నద నెఱింగి
స్వజనదుష్కృతి. ఎవ్వరో స్వజన మన్న?
సిగ్గుచే కాను వినగ నా చెనటిపేరు.

కంచు :- పూజ్య కైకేయి.

రాము :- అమ్మయా? అయిన, మహత్తరప్రయోజన మేమో యుండవచ్చును.

కంచు :- ఎట్లు?

రాము :- వినుము.

ఇంద్రసదృశుండు భర్తయు, నిట్టి నేను
పుత్రకుడ నయ్యు మా యమ్మ పొల్లుకార్య
మేమి ఫలమును కావించి యిట్లు జేయు
నమ్మ మియ్యది సత్ఫలదమ్ము నిజము.

కంచు :- నాయనా! సహజకుటిలము లగు స్త్రీజనమనోగతుల నాత్మగత మైన సద్భావ ముంప దగదు. ఆమె మాటచేతనే కదా నీయభిషేక మాగిపోయినది?

రాము :- మేలే కదా అట్లగుట.

కంచు :- మేలా ? ఎట్లు ?

రాము :- ఒక్క మేలా ? వినుము-

నను విడి పూజ్యపాదులు వ
నంబున కేగమి తొలుత మేలు, నే
నును మఱి తండ్రిచాటునను
నూల్కొను బాలత నుంట మేలె, యి
జ్జనమును క్రొత్తరా జనుచు
శంకవిమర్శన సేయకుంట మే
లనుజులు చిన్నచూడబడి
రన్నది లేమియు మేలు మేల గున్.

కంచు :- అయిన బిలువ బెట్టబడకుండగనే వచ్చి భరతుని రాజ్యాభిషిక్తునిచేయు మనేను. ఇందు నాశ లేదా!

రాము :- ఆర్య! మీరు నా మీద నుండు నభిమానమున నసలువిషయము గమనించుట లేదు. ఎట్లనిన -

తనదు పెండిలి శుల్క మా ధరణిరాజ్య
మాత్మసుతునకు గోరుట యమ్మ కాస ?
అట్టి తమ్ముని రాజ్యము నపహరించు
మాదుపట్లను లోభమ్ము లేద యేమి ?

కంచు :- తరువాత !

రాము :- తరువాత నక్కర లేదు. మాతృనిందను వినదల పను. మహారాజుగారి వృత్తాంతము కొంచెము చెప్పుము.

కంచు :- తరువాత-

శోకతీవ్రత మాటాడ లేక ప్రభువు
హా స్తసంజ్ఞనె పొమ్ము పొమ్మనియె దేవిఁ
గీడులో మేలు, పెన్మూర్ఛ కూడె పతిని
శోకతీవ్రత తెలియగా రాక యుండ.

రాము :- అయ్యో! ఎట్లు? మూర్ఛ పోయెనా ?

[తెర లో]

"ఎట్లూ? ఎట్లు మూర్ఛవోయె ననియా"
పతి దగు మూర్ఛసైప వో కో
పట్టుధనుస్సును వీడుమీ దయన్.

రాము :- (విని ముందునకు జూచి)

సహజముగ లక్ష్మణుడు ధైర్యసాగరుండు
చలన మెరుగని గంభీరు డలుక నేడు
సంచలించుచు నా ముందు ఝూంకరించు
నొక్క డయ్యెను వేన వేలున్నయట్లు.

(విల్లు నమ్ములతో లక్ష్మణుడు ప్రవేశము)

పతి దగు మూర్ఛసైప వో కో!
పట్టుధనుస్సును; వీడుమీ దయన్.
అతిమృదుభావుడున్ సరసు
డైన నినున్ పరిభూతు జేయునే ?

హితమిది కాదో నీకు విడు
మీ నను, నాడుది యన్న మాటయే
క్షితి నిక మాపువాడ నిది
సిద్ధము, ఇట్టుల మోసగింతురే.

సీత :- ఆర్యపుత్ర! దుఃఖకాలమున లక్ష్మణుడు విల్లు పట్టె నేల? ఇట్టి యాతని యవస్థ మున్నెన్నడును చూడలేదు!

రాము :- సౌమిత్రి! ఏమిది?

లక్ష్మ :- ఏ మేమి? ఇది యేమా!

న్యాయ్యముగ నీది యా రాజ్య మపహరింప
పుడమిపై ప్రాలి భూపతి పౌగులు చుండ
నింక సందియమున నేమి యేమి యందు
విద్ది యమనస్వితయొ? యోర్మి యెనయు టొక్కొ?

రాము :- సౌమిత్రి! నాకు రాజ్యము పోయిన దని నీవు కలహమునకు కాలుద్రవ్వుచుంటివా! ఎంత యజ్ఞుడవు నాయనా!

ఏను రాజైన భరతుడు నైన నొకటె.
అన్న లక్ష్మణ! నీ కేల నయ్య కలత?
వింటి నేర్పును, దోర్యగవీర్య మున్న
భరతరాజ్యసంరక్షణపరుడ వగుము.

లక్ష్మ :- రోషము దుర్భరముగ నున్నది. కానిమ్ము, పోయెదను (బయలు దేరును)

రాము :- అకట! సోదరలక్ష్మణభ్రుకుటి నేఁడు
భీకరం బయి కన్పట్టు, విధియె కోఁతి
ఫాలతలమున నెలకొన్న వడువు దనరి
ముజ్జగమ్ములు దహియించుపూన్కి ననఁగ.

తమ్ముఁడా! ఇటు రమ్ము.

లక్ష్మ :- చిత్తము (అని వచ్చును)

రాము :- నాయనా! నీకు ధైర్యము కలిగించుటకై యట్లు చెప్పితిని. అయిన చెప్పెదను.

జనకునిసత్యపాలనము
సల్పెడువానిని నొవ్వ నేయనా?
జననినిజార్థముం గొనఁగ
సాయక మేయుదునా దురాత్మతన్?
అనుజుని దోసమే యెఱుఁగ
నట్టి నిష్ఠురత సంహరింతునా?
ఘనదురితమ్ము లివ్వి యెది
కా దగు దుచ్యము రోషవహ్నికిన్.

లక్ష్మ :- (కన్నీటితో) అయ్యో! నా యభిప్రాయము గ్రహింపక నిందించుచుంటివి.

రాజ్య మే మైన గానిమ్ము, లక్ష్మణుండు
దానికై దుఃఖపడ డింత తథ్య మిదియు,
కాని, పదునాలు గేండ్లు నిష్కారణముగ
ఘోరవనముల మీా యున్కి కుములఁజేయు.

రాము :- ఇందుచేతనా తండ్రిమూర్ఛపోయినది ! అయ్యో!
అస్వాతంత్ర్యతను ప్రకటించెనే, మైథిలి!

ఇతరరాజన్యు లేరికి నింతదనుక
లభ్యపడ నట్టి ధర్మపాలనముకొరకు
కట్టువాడను తెమ్ము వల్కలము లిపుడ
యీవె శుభమును గోరి తా నిచ్చె వేని.

సీత :- ఇవిగో గ్రహింపుడు.

రాము :- జానకి! నీ వేమి చేయజూతువు ?

సీత :- నేను సహధర్మచారిణిని గదా!

రాము :- న న్నొక్కడనే కదా పొమ్మన్నది ?

సీత :- అందులకే నేనును వచ్చుట.

రాము :- వనమున వసింప బోవునది.

సీత :- అదియే నాకు నంతఃపురము.

రాము :- అత్తమామల సేవయు చేయవలయును గదా!

సీత :- వారికై దైవమును ప్రార్థింతును.

రాము :- లక్ష్మణా ! ఈమెను వారింపుము.

లక్ష్మ :- ఆర్య! ఉచిత మైనపని నుండి యామెను వారింప జాలను. చూడుడు——

అనుగమనం బొనర్పదొ శ
శాంకుని దారక రాహుబాధితున్
మునుకొని పడ్డ తాఁ బడదొ
భూజముతో లతయున్ ధరాస్థలిన్

అనయము పంకమగ్నుఁ డగు
నంచు కరీంద్రుని వీఁడునేమి హ
స్తిని, యటె యీమెధర్మమును
జేయును; స్త్రీ లెటు భర్తృనాథలే!

చేటి :- (ప్రవేశించి) జయము భట్టిని.

నేపథ్యరక్షకురా లైన రేవాదేవి నమస్కరించి విన్న వించుకొనుచున్నది. "అవదాతిక సంగీతశాల నుండి బలవంతముగా వల్కలములు గొనివచ్చినది. సరిక్రొత్త వల్కలము లివిగో. వలసినచో వీనిని వాడుఁడు." అని.

రాము:- ఇటు తెమ్ము. ఆమె వానితోడనే తృప్తి నందినది. నాకు నిమ్ము.

చేటి :- తీసికొనుడు. (ఇచ్చి పోవును)

(రాముడు గ్రహించి కట్టుకొనును)

లక్ష్మ :- అనుగ్రహింపుడు.

మును తనుత్రాణభూషణపుష్పహార
ములను నన్నిట సాంశాలు గలుగ జేసి
ఇంత స్వార్థమ్ము నీకు నే డేల కల్గె
కట్టి తీ వొక్కరుడవె వల్కలము లిట్లు.

రాము :- జానకి! తమ్ముని వారింపుము.

సీత :- లక్ష్మణా! ఆగు మను చుండిరి.

లక్ష్మ :- అమ్మా!

పూజ్యపాదుని పదపద్మములకు సేవ
సే వాక ర్తవె సేయగా నిచ్చగింతొ?
అట్టు లగుటకు వీలు లే దమ్మ వినుము
వామపాదము నీది, సవ్యమ్ము నాది.

సీత :- కరుణింపు ప్రభూ! బాధపడుచున్నాడు సౌమిత్రి

రాము :- తమ్ముడా! వల్కలము లనగా—

కవచ మిది తప మ్మనెడు సంగ్రామమునకు,
నంకుశము తీవ్రనియమావళి యనెడుకరికి
క ళ్ళె మింద్రియతురగసంఘాతమునకు
ధర్మసారథ్ నారలు తండ్రి గొనుమ!

లక్ష్మ :- అనుగ్రహింపబడితిని.

రాము :- ఈ విషయ మెఱిగి, పౌరులు రాచబాట నడ్డ చున్నారు. తొలగింపుము - తొలగింపుము.

లక్ష్మ :- నేను ముందుపోవుదును. తప్పుకొనుడు, తప్పుకొనుడు

రాము :- జానకీ! మేలిముసుగు తొలగింపుము.

సీత :- అటులనే, (తీసివేయును)

రాము :- ఓహో! పౌరులారా! వినుడు-

కను డిక స్వేచ్ఛగా జనకు
గాదిలిపట్టి మదీయపత్ని స
ద్వినుతను, దుఃఖసంభరిత
వీక్షణపంక్తుల మోము లెత్తి యిం

కను మఱి సంశయింపకుడు.
కాంచగవచ్చును స్త్రీల యజ్ఞ మం
దునను, వివాహకాలమున,
దుఃఖపువేళ, వనమ్మునందునన్.

కంచు :- (ప్రవేశించి) నాయనా! పోవలదు, పోవలదు. ఇదుగో మహారాజుగారు.

విని నిటు నీవు నీ సతియు
భీకర కాననభూమి కేగుటల్
ఘన మగు సోదరప్రియత
కౌతుక మొప్పగ లక్ష్మణుండునున్
జనుటయు నీదు వెంట విని,
సాగె గృశించినరాజు లేచి రా
గను నిటు, ధారుణీరజము
కప్పిన కాననమాగమో యనన్.

లక్ష్మ :- ఆర్య!
నారలనుమాత్రి ధరియించి ఘోరవిపిన
మేగువనవాసులను జూడ నేమి ముదము

రాము :- ఏము పోయినపిమ్మట నినకులేశు
డిందు మా మన్కిపట్టు లీక్షించు గాక.

(ఎల్లరు నిష్క్రమింతురు. తెరపడును)

(ప్రథమాంకము సమాప్తము)

ప్రతిమ

ద్వితీయాంకము

(కంచుకి ప్రవేశించును)

కంచు :— ఓ ద్వారరక్షకులారా! మీ మీ స్థానముల జాగరూకులై యుండుడు.

ప్రతీ :— (ప్రవేశించి) అయ్యా! ఏ మది?

కంచు :— అదుగో మహారాజుగారు. సత్యవాక్యపరిపాలనోత్సుకులై, అరణ్యము పోవు రాముని మరలింపలేక, పుత్రునెడబాటున సంతప్తులై, పిచ్చివానివలె నేమో పదింబదిగ బలుకుచు సముద్రగృహమున పరుండి యున్నారు.

యుగవిలయాంతికమ్మున మ
హోగ్రత బంగరుకొండ యూగి పో
వుగతి, నపారవార్ధిజల
పూరము లింకు విధమ్ము గాగ, తా
విగతమయూఖుడై పడుచు
బింబముమాత్ర గనంగ నౌ దినే
శుగతి, నరేంద్రుడార్తివివ
శుండు విశీర్ణమన స్తనుండు నౌ.

ప్రతి :- అయ్యో! ఎంత దుస్థితి కలిగినది సాహోదరులకు!

కంచు :- ఏ దమ్మా! పోదము పద.

ప్రతీ :- అయ్యో! అటులనే.

కంచు:-(అంతటను జూచి) హా! రామచంద్రుడు వెళ్లిన దాది శూన్యముగా కన్పించు చున్నది అయోధ్య. ఎట్లన—

గడ్డిపోచయు నేని కాంక్షింప కిప్పుడు
కరిఘటపురిలోన కార్శ్య మొందె
కన్నీరుకాల్వగా కార్చుచు సకిలింపు
మాని యశ్వమ్ములు మ్రానుపడియె
ఆబాలగోపాల మన్నపానీయముల్
కల నైన దలపక కలగు చుండె
సతియు తమ్ముండును సహచరు లై రాము
డరిగిన దెసఁ బ్రజ లార్తి గంద్రు
బిక్కమొగముల నటు చూచి వెక్కి యేడ్తు
రంతిపుర మెల్ల హాహారవం బడలు నట్టె
అదియు నిది యేల ప్రకృతియే యార్తి మునిగె
మునుగ కే మాను శ్రీరాము మోము గనక.

రామచంద్రా! (కన్నీటితో) నేను ప్రభువు చెంతకు పోదును. (ముందునకు జూచి) కౌసల్యాసుమిత్రలు పుత్ర దుఃఖము తమ కే అసలు భరింపరాని దై నను, తాము మ్రింగి, మహారాజుగారి నూరార్చు చున్నారు. ఎంత కష్టతర మైన యవస్థ వచ్చినది. ఇదుగో మహారాజుగారు.

ఉస్సు రను రంచు మాటికి నులికి పలుకు
లేచి లేచియు పడు నొక్కలీలగాను
అశ్రుపూరితనయను డై యార్తి జూచు
తనయు డేగిన యా వైపె యినకులుండు.

(నిష్క్రమించును)

(మిశ్రవిష్కంభము)

(పైన చెప్పినట్లు దేవులతో రాజు ప్రవేశము)

రాజు :- అకట! రఘురామ! లోకనేత్రాభిరామ!
లక్ష్మణా! సర్వశోభనలక్షణుండ!
తల్లి! జానకి! పతిదేవతామతల్లి!
వనముపాలైర బిడ్డలు! పలక రేల?

ఆశ్చర్యము! అన్నపై ప్రేమచే, తండ్రిపై ప్రేమకూడ వదలిన కొమరుడైనను లక్ష్మణుని జూడవలె నని నా మనస్సు తహతహపడుచున్నది. బిడ్డా! మైథిలి!

వదలె నను రాము డిక్ష్వాకువర్ధనుండు
రోసి నటు వీడె సౌమిత్రి రోసమునను
నీవు గూడను విడిచితి నేనుమాత్రి
శాశ్వతం బవు దుష్కీర్తి జావవలసె.

తండ్రి!రామ! బిడ్డా! లక్ష్మణ! తల్లి! వైదేహి! సమాధాన మీయరా! నాయనలారా! అయ్యో! ఇది శూన్యమా! ఎవ్వరును సమాధాన మీయరా! కౌసల్యానందన! రామ! ఎక్కడ తండ్రి! నీకును కోపమా!

నిత్యసత్యవ్రతా! ప్రేమనిర్ఝరాత్మ!
క్రోధమాత్సర్యరహిత! మత్కులవిధాత!
వినవ! కోపమ! విశ్వసంప్రీతిమహిత!
పల్కు మొకమారు గురుజనభక్తినిరత!

హా సర్వజనహృదయాభిరాముడు రాము డెక్కడ? నాయం దెక్కుడుమక్కువగల నా తండ్రి యెక్కడ? కంట నీ రొట్టువారి కరుణ గనువా డెక్కడ? అపార రాజ్యవైభవము గడ్డిపోచవలె త్రోసిపుచ్చిన నిష్కాముడు రాము డెక్కడ? రామ! ముదుసలినే, తండ్రినే, నన్ను వదలి అటవుల కేగుట యెక్కడిధర్మము! అయ్యో! దుర్భరము.

దినకరునిభాతి రాముడు జనియె వనము
రవిని దిన మట్లు వెన్నంటె లక్ష్మణుండు
నహము పొద్దును కనుమరుగైన యంత
ఛాయవలె సీత కన్పట్టుజాడ తొలగె.

(పైకి జూచి) ఓ దుష్టవిధీ!

బిడ్డలే లేని గొడ్డు గావించి నన్ను
సుతుని గా రాము వేరుసత్పతికి జేసి
కైక బెబ్బులిగా ఘోరకాననమున
నేల చేయవు? నీ తెలి వేమి మయ్యె!

కౌస :- (ఏడ్చుచు) అయ్యో! స్వామీ! అపారదుఃఖ సాగరమున మునిగిన స్త్రీవహ తప్ప నేమో! పదునాల్గేండ్లతుదను పతి బిడ్డలను ముప్పార గాంచుగాత!

రాజు :- ఆ! ఎవరు నీవు ?

కౌస :- పితృప్రేమ లేని పుత్రునిఁగన్న దౌర్భాగ్యురాలను నేనే.

రాజు :- ఏమి ? ఏమి ? సర్వజనహృదయాభిరాముఁడైన రామునితల్లివి కౌసల్యవా ?

కౌస :- ఆ నిర్భాగ్యురాలనే.

రాజు :- కౌసల్యా ! రత్నగర్భవు. నీ గర్భశుక్తిముక్తాఫలమే కదా రామచంద్రుడు !

శోక మియ్యది కార్చిచ్చుచొ ప్పసంగి
తగులబెట్టెడు నంత కంతకును తనువు
నింద్రియగణమ్ము పట్టుల నెల్ల వీడె
నోరువఁగ జాల నణచుకో నేరజాల.

(సుమిత్రను జూచి) ఈమె ఎవరు ?

కౌస :- మహారాజా ! బిడ్డ లక్ష్మణుని............
(సగము లో)

రాజు :- (వెంటనే లేచి) ఎక్కడ ? లక్ష్మణు డెక్కడ ? కన్పించుట లేదు. హా ! కన్పించుట లేదు. తండ్రి! అయ్యో ! బాధ —

(దేవులు త్వరగ లేచి రాజును పట్టుకొందురు)

కౌస :- మహారాజ ! లక్ష్మణునితల్లి సుమిత్ర యని చెప్పఁ బోయితిని.

రాజు :— ఆ! సుమిత్రా! (మెల్లగా)

వేయిపవలును వనములఁ జాయపోల్కి
రఘుకులాన్వయభూషణుం, రామచంద్రు
కన్నుసన్నల మెలగు కింకరత, గాన
నీ కుమారుడె యుత్తముం డో కొమరుడు.

కంచు :— (ప్రవేశించి) జయము మహారాజులకు. పూజ్యులైన సుమంత్రులు విచ్చేసిరి.

రాజు :— (వెంటనే లేచి సంతసమున) రామునితోడనేనా!

కంచు :— కాదు! రథముతో,

రాజు :— ఏమి? వట్టి రథముతోడనా?

(మూర్ఛిల్లును)

దేవులు :— (శరీరము తాకి)

ఊరడిల్లుడు ప్రభూ! ఊరడిల్లుడు.

కంచు :— దుర్భరము. ఇట్టివారికిగూడ నిట్టికష్టములు దప్పవన్న విధి యనుల్లంఘనీయము! మహారాజ! ఊరడిల్లుడు; ఊరడిల్లుడు.

రాజు :— (కొలది యూరడిలి) బాలాకి! సుమంత్రు డొక్కడే వచ్చెనా?

కంచు :— చిత్తము ప్రభూ!

రాజు :— అయ్యో! దుర్భరము—

వట్టియరదమె తా నిట వచ్చె నను
గాదు నాసలు మొదలంట నాశ మయ్యె;

కఠినుడు దశరథు గొనిపోవ గాలు డంప
వచ్చునరదమ్మొ గాదె యీ పట్టిరథము.
కాన వెంటనే రా నిమ్ము.

కంచు :— చిత్తము. (నిష్క్రమించును)

రాజు :— వనపథమ్ముల విహరించు నినకు లేశు
రాము దనివార గౌగిలి బ్రాముకొనెదు
కొలనికెలకుల జరియించు కోదమగాలు
లేమిపున్నెంబు జేసెనో యేమొ తెలియ.

(అంత సుమంత్రుడు ప్రవేశము)

తమతమకర్మముల్ విడిచి
తాలిమి దక్కి కలంగి బాష్పపూ
రము కను లందు బోరునను
రాల్చుచు రాపడి దీనదృక్కులై
తమతనువుల్ దహించెడు సు
దారుణశోకదవానలమ్ముచే
కుమిలిన సేవకాళిపతి
క్రుళ్లుచు నుండగ నిట్టు లుండిరే!

(సమీపించి) జయము మహారాజులకు.

రాజు :— అన్నా ! సుమంత్రి !
ఎచ్చట నాదు పెద్దకొడుకు . . . ?
ఊహూ ! కాదు ! పొరపాటు; అట్లనరాదు.
ఎచ్చట నీదు పెద్దకొడుకు
కిమ్ముగ బిడ్డల జూచువాడ ! యే

డిచ్చుటరాము ? జేష మిథి
   లేశసుపుత్రి గురున్నిజం బనకఁ
హా చ్ఛగుభక్తి జూచునది ?
   యేడి సుమిత్రితనూభవుం డయో
చచ్చెడుతండ్రి నే మనరొ
   సర్వజనార్తిమహాబ్ధికారకుఁ.

సుమం : మహారాజా ! అశ్లీలములు పలుకకుడు. స్వామీ ! త్వరలోనే వారిని జూడగలరు.

రాజు :- నిజముగ తగనిమాట లాడితిని. తపోధనులకు తగిన ప్రశ్న కాదిది. చెప్పుము; తపస్వులతపస్సు నిర్విఘ్నముగా వృద్ధిపొందు చున్నదా ? తాను సంచరింప ననువుపడి యరణ్యముల జానకి బాధ నొందదుగదా !

సుమి :- పలు నారచీరలుకట్టు కోమలాంగి, పసి యయ్యు ముసలివలె జీవితయాత్రనడుపుతల్లి, మగని చాయవలె ననుసరించు మహాసాధ్వి, జానకి మమ్ములగూర్చి కాని, మహారాజులగూర్చి కాని యేమియు ననలేదా !

సుమం :- సమస్తమును ప్రభువునుగూర్చియే.

రాజు :- కాదు. కాదు. ఏదీ చెప్పుము. శ్రవణపేయము లై, హృదయావేదనాహారకము లైన అమృతంపుసోనల గురియింపుము.

సుమం :- చిత్తము. చిరంజీవి రాముడు.

ప్రాణముల నిల్పికొని యింక బ్రతుకగలను
మందనున్నాత డమృతాన బ్రతుకు నట్లు

సుమం :- శృంగిబేరపురమున రథము దిగి, యయోధ్య కెదురై యందఱు మహారాజులకు సమస్కరించి, విన్నవింప మొదలిడిరి.

చిరముగా నేమొ మనముల జింత జేసి
పలుకదలచియు పెదవులు చలన మంద
బాష్పసంరుద్ధకంఠులై పలుకలేక
యట్టె దుఃఖమ్ము గ్రుంగుచు నటవి జనిరి.

రాజు :- ఏమియు జెప్పకయే యడవి కేగిరా!
(రెట్టింపు మూర్ఛ)

సుమం :- (తొట్రుపాటున) కంచుకీ! మహారాజుగారు తీరని వ్యాధిలో నున్నారని మంత్రులతో జెప్పుము.

కంచు :- చిత్తము (పోవును)

దేవులు :- ఊరడిల్లుడు ప్రభూ! ఊరడిల్లుడు.

రాజు :- (కొలది యూరటతో)

రమ్ము కౌసల్య! నాదు దేహమ్ము దాకు
తాన లే కుంటి ని న్నేమొ కన్ను విచ్చి
రాము వెంటనె మన మేగి రాక యుండె
ఉండదును పోదు జీవ మే యండ గనియొ.

తండ్రీ! రామ! నే నెప్పుడు నేది తలంచు చుంటినో తెలియునా!

ఘనముగ నీకు పట్టమును
 గట్టి ధరిత్రి, ప్రజల్ కృతార్థులై
మనగను సన్నరేంద్రు గని,
 మత్సర మేమియు లేక తమ్ముల
న్నన యగువైభవంబు వెల
 యింపగ గోరి సతంబు నిన్ను, నే
వనమున కేగ నెంచితిని,
 భగ్నము చేసెను కైక యంతలోన్.
సుమంత్ర! కైకకు తెలుపుము.
 "రాము డడవులపా లయ్యె, ప్రాణములను
 వీడు చుంటిని నేను, సంప్రీతి దనర
 త్వరగ పిలిపింపు సత్పుత్రు, పాపఫలము
 పట్టమును గట్టి కులుకుడీ భరతు డీవు"
 అని

సుమం :- చిత్తము.

రాజు :- (పైకి చూచి) అహా! రామవృత్తాంతశ్రవణముచే దగ్ధహృదయుడ నగు నన్నూరడింపవచ్చి రీ పితృదేవతలు. ఎవ రక్కడ!

కంచు :- (ప్రవేశించి) జయము మహారాజులకు

రాజు :- మంచినీ రిమ్ము కొంచెము.

కంచు :- చిత్తము (పోయి తెచ్చి)
 జయము మహారాజులకు. ఇదిగో మంచినీరు.

రాజు :- (ఆచమించి చూచి)

ఇట దిలీపులు పేరు ! దేవేంద్రసఖులు
పేరు రఘువులు జనకుతా పేర లజులు
వచ్చిరే లోకొ తెలియగాబడదు నాకు
నన్ను మీ తోడ గొనిపోవ నెన్నినారొ !

రామ ! వైదేహి ! లక్ష్మణా ! నేను పితరులతో పోవు చున్నాను. తాతలారా ! ఇదే వచ్చు చున్నాను. (మూర్ఛ మునుగును)

(కంచుకి తెర కప్పును)

అందరు :- హా ! మహారాజు హా ! మహారాజు :

(నిష్క్రమింతురు)

(ద్వితీయాంకము సమాప్తము)

ప్రతిమ

తృతీయాంకము

(సుధాకరుడు ప్రవేశించును)

సుధా :- (కసవు వూడ్చి నీరు జల్లుట మొదలగుపనులు చేసి) ఆర్యుడైన సంవాహకుడు చెప్పిన ట్లంతయు జేసితిని. నిద్రపోదును. (నిద్రించును)

భటు :- (ప్రవేశించి చేటుని సమీపించి కొట్టి) అరే! వెధవ కొడకా! ఏమియు పనిచేయుట లే దేమిరా?

సుధా :- (మేల్కొని) కొట్టు, కొట్టు.

భటు :- కొట్టిన నేమి చేసెదవురా?

సుధా : నా కర్మము. దురదృష్టవంతుడను. నాకు కార్త వీర్యునికివలె వేయిచేతులు లేవు.

భటు :- ఎందుకురా వేయిచేతులు?

సుధా :- నిన్ను చంపివేయుటకు.

భటు :- రారా వెధవా! చచ్చువరకును వదలను (కొట్టును)

సుధా : (ఏడ్చి) అయ్యా! నా తప్పేమో యిప్పుడైనను సెల వీయగలరా?

భటు :- త ప్పే మున్నదిరా? ఎబ్బే. త ప్పేమియు లేదు. అయిన నేను చెప్పలేదా ?

"రామచంద్రులు రాజ్యభ్రష్టు లైనదుఃఖముచే దశరథ మహారాజుగారు గతించిరిగదా వారి ప్రతిమాగృహమును చూచుటకు నిప్పుడు కౌసల్యమొదలుగా నంతఃపురజన మిటువచ్చు నని. ఇప్పు డిక్కడ నీ వేమిచేసితివి?

సుధా :- చూడుడు స్వామి! లోపలిభాగము పావురముల గూళ్లు లే కుండ బాగుచేసితిని. సున్నము వేసినగోడలపై నైదు వ్రేళ్ల గంధపుగుర్తులు వేసితిని. పూలమాలలు ద్వారములకు కట్టితిని. అంతట నిసుక చల్లితిని. ఇంక నిక్కడ నేను చేయని దేమి చెప్పు బాబు!

భటు :- అటులనా! అయిన, నిశ్శంకముగా పొమ్ము. నేనును పోయి మంత్రులతో నంతయు నెరవేర్పబడిన దని తెల్పుదును.

(నిష్క్రమి

(ఇది ప్రవేశకము)

(తరువాత భరతుడును రథముతో సూతుడును ప్రవేశము

భర :- (ఆత్రముతో) సూత! చాలకాలముగా మామగారి యింట నుండుటచే నయోధ్యావిశేషము లేమియు తెలియుటలేదు. మహారాజుగా రస్వస్థు లైయున్నా రని వింటిని చెప్పుము.

ఏమివ్యాధియో తండ్రికి?

సూతు :- హృదయబాధ.

భర :- వైద్యులే మందురో!

సూతు :- దాన వైద్యు డెవడు?

భర :- ధారకము!

సూతు :- లేదు.

భర :- శయ్యయో!

సూతు :- ధరణిపైన.

భర :- తగ్గునే!

సూతు :- ఈశుకృప.

భర - గుండెతలకు దడను

పోవ నిమ్మింక రథము వే పోవ నిమ్ము.

సూతు :- ఆయుష్మంతుని చిత్తము (త్రోలును)

భర :- (రథవేగము సూచించి) ఆహా! ఏమి యీ రథగమన వేగము!

తమతమకుం గలట్టి యెడ
దవ్వులు నీల్గి పఱుంగు వెట్టు నాఁ
దుృమములునో, నదీజలము
దొర్లుచుప డ్డటు భూమినేమిరం
భ్రమముల బడుఁ, కనంబడ వ
రమ్ములు, తిర్గుచు తిర్గ నట్టు చ
క్రము కనుపట్టు, ధూళి యొదు
రం బడు, వెన్బడ దెంత వేగమో!

సూత :- కుబుదగొన్న యీ పట్టాభిషేకమే యయోధ్య కావచ్చును.

భర :- ఆహా! నా వారిని చూచుటకై నను నాత్రమువలన నెంతత్వర! ఇప్పుడే—

జనకు పదాల బడ్డట్లు, వి
శాంపతి మూర్ధ్నిని యెత్తినట్లు, ప్రే
మను కనునీట ముంచినటు
మాతలు, వే నను సోదరాళి మూ
గినయట్లు, పెద్దయయ్యో పెరి
గెఁ సముడే యని సేవకుల్ నుతుల్
బొనరిచి నట్లు, లక్ష్మణుఁ డ
పూర్వత గన్నటు వేషభావలన్.

సూ :- (తనలో) అయ్యో! పాపము! మహారాజుగారు మరణించిన దెరుగక భరతుడు వ్యర్థమగునాసతో నయోధ్య ప్రవేశించుచున్నాడు. తెలిసియు మేము చెప్పలేముగదా!

అంత యా తండ్రి యట్లు తా నంత మగుట
యన్న రాముడు వనముల కరుగుటయును
తల్లి పేరాస నపవాదు తనుకుటయును
కఠిను డై వేడు చెప్పగ గలడు మూడు.

భటు :- (ప్రవేశించి) జయము కుమారులకు!

భర :- శత్రుఘ్నుడు నాకై వచ్చెనా?

భటు :- చిత్తము. దగ్గఱనే యున్నారు. కాని, ఉపాధ్యాయులు తమ కిట్లు చెప్పు మనిరి.

భర :- ఏ మని?

భటు :- కొలదికాల మింకను కృత్తిక యున్నదట. రోహిణి రాగానే అయోధ్యలో తమరు ప్రవేశింపదగు నని.

భర :- బాగు. గురునాన మీరరానిదిగదా! అట్లే పొమ్ము

భటు :- చిత్తము (పోవును)

భర :- ఎచ్చట కాలముగడుపుదును? అదిగో! ఆ చెట్ల మధ్యలో నున్న దేవాలయమున కొంచెముసేపు న్నే దేరెదను. దాన దేవతారాధనమును, విశ్రాంతియు రెండు నగు. పొలిమేరల కొలదిసేపుండి పురము ప్రవేశించుట యాచారముగదా! సరే. కాన రథము నిచట నిలుపుము.

సూ :- చిత్తము (రథము నాపును)

భర :- (రథము దిగి) గుఱ్ఱములను విశ్రమింప జేయుము.

సూతు :- చిత్తము (నిష్క్రమించును)

భర :- (కొలదిదూరము పోయి చూచి) ఆహా! పుష్పలాజలతో పెట్టిన బలులు, గంధముచే పంచాంగుళచిహ్నితము లైన గోడలు, పూలమాలల పొల్పగుద్వారములు, నీ యిసుక, నే డేమి పర్వదినమా? లేక నిత్య వ్యవహారమేనా? ఏ దేవతావిశేషము కల దిందు!

ఈ బయటపరిహారణముగాని, ధ్వజముగాని రేమియు లేదే? ప్రవేశించి తెలిసికొందు. (ప్రవేశించి చూచి) ఆహా! శిల్పసౌందర్యము! ఈ విగ్రహముల భావ పరిపోషణము, దేవతలుగా చెయ్యబడినను మానుష రేఖలు చిమ్ముచునే యున్నవి. ఎవ్వరై యుందు రీ నలువురుదైవములు. ఎవ్వరైన నేమి? నాకు మనోమోదము కల్గుచున్నది.

దైవమూర్తులె యంచు నా తలను వంచి
మోకరింతును గాకేమి మోదమునను
కాని, నాచేత శూద్రవిధాననె యగు
మంత్రపూతమ్ము కాకున్న మాత్రమునను.

దేవ :- (ప్రవేశించి) నిత్యకర్మానుష్ఠానాంతమున బల్యాదుల నొసంగుచుండ ప్రతిమాగృహమున ప్రతిమలతో సరిపోలు సీత డెవ్వరో ప్రవేశించినాడు. కానిమ్ము. లోనికి పోయి తెలిసికొందును.

భర -: (ప్రవేశించి) వందనములు.

దేవ :- నమస్కరింపవలదు.

భర :- వల దనియా! హా!

దొసగు లేవైన మాయెడ దొరలె నొక్కొ-
లేక మాకన్నపూజ్యు లేరే గల రొకో?
ఇచటి నియమాళి కతమున నేమి లేక
ప్రణతి యే లయ్య వల దంటి? పలుకు నిజము.

దేవ :- పై కారణములచే వేనిచేతను వల దనుట లేదు. దేవత లనుకొని నమస్కరించుచున్నారేమో! తమరు బ్రాహ్మణులు గదా యని వల దంటిని. తమరు క్షత్రియులా!

భర :- అవును: తమరు క్షత్రియులా అనగా మీ రెవరు?

దేవ :- ఇక్ష్వాకువంశదీపకులు.

భర :- (సంతోషమున) ఇక్ష్వాకువంశదీపకులా! అనగా నయోధ్యాధిపతులా! అహా!

వీ రసురాళినాశమున
వేల్పుల కండగ నిల్చి నారహో!
వీరలు నాక మేగిన ప
విత్రకృతుల్ స్వజనమ్ము తోడ, ని
వ్వీరలు బాహువీర్యజిత
విశ్వసమగ్రులు, నిర్జితాత్ము లౌ
వీరు కృతాంతు గుప్పిటను
పెట్టిన మైచ్ఛికజీవితప్రభుల్.

అనుకొనకుండ నే డెంతటి మహాఫలము నందితిని! వీ రెవరో ఒక్కొక్కరినే తెల్పుడు.

దేవ :- అనర్ఘరత్నరాసుల గొల్లవెట్టి విశ్వజిద్యాగము జేసి, లోకమున ధర్మజ్యోతి వెలిగించిన దిలీపమహాప్రభువులు వీరు.

భటు :- అహో! ధర్మపరాయణులకు నమోవాకములు. వీ రెవ్వరు ?

దేవ :- అనేక పుణ్యాహమంత్రశబ్దముల జాగరితస్వప్నుల నందిన రఘుమహారాజులు వీరు.

భర :- ఆహా! తన్మహాశౌర్యాదశక్తిని కూడ నతిక్రమించెనే మృత్యువు! విప్రార్థము రాజ్యఫలము త్యాగము చేసిన ప్రభువునకు నమస్సులు. వీ రెవ్వరు ?

దేవ :- వీరు ప్రియావియోగనిర్వేద పరిత్యక్తరాజ్యభారులు, నిత్యావభృథస్నానప్రశాంతరజు లజులు.

భర :- స్తవనీయపశ్చాత్తాపులకు నమస్కారము. (దశరథప్రతిమను జూచి కలత నొంది) ఈ మహాపురుషాకృతివిశేషముల ధారణచేయలేకపోతిని. వీ రెవ్వరో మరల తెల్పుడు.

దేవ :- వీరు దిలీపులు.

భర :- మహారాజుగారి పితృపితామహులా! తరువాత—

దేవ :- వీరు రఘువులు.

భర :- మహారాజుగారి పితామహులా! తరువాత—

దేవ :- వీ రజులు,

భర :- నాయనగారితండ్రిగారు వీరా! ఏమేమి! మరల-

దేవ :- వీరు దిలీపులు, వీరు రఘువులు, వీ రజులు.

భర :- కొంలదిసందియము కలదు.

దేవ :- సెల విందు

భర :- అయిన సజీవులకుగూడ ప్రతిమ లుంతురా?

దేవ :- ఉండరు! పోయినవారికే ఉంతురు.

భర :- అయిన — సెలవు

దేవ :- ఆగు నాయనా!

ప్రియరమణి కైన యుంకువ విశ్వరాజ్య
మిట్టె యసువులతో గూడ నిచ్చినట్టి
రాజశేఖరు దశరథు ప్రతిమగుతించి
ఏలయడుగవు? తండ్రి! నీ వెవరో తెలుపు!

భర :- అయ్యో! తండ్రీ! (మూర్ఛవోయి లేచి)
హృదయమ! శంక సేసి తెదో
యింతటిదన్కను, తృప్తి నందుమా.
అదె విను తండ్రి దా మరణ,
మాత్మను ధైర్యముపూను, మోలి యన్
పద మిది నాకె తాకునెడ,
ప్రాణము లుంకువ వెట్టి దైన చూ
పుదు నిక నాదునిర్మలత,
పుట్టునె యింతటినీచబుద్ధులున్!
అయ్యో!

దేవ :- ఆహా! ఈ సంబోధన మిత్ష్వాకుకులోచితముగదా! నాయనా! కైకేయీదేవిబిడ్డలా మీరు? భరత కుమారులా?

భర :- అవు నవును. దశరథమహారాజుపుత్రుడ. కై కేయికి కాదు.

దేవ :- అయిన; సెలవు.

భర :- ఉండుడు. తర్వాత చెప్పుడు.

దేవ :- ఏమిగతి? వినుడు బాబు.—

పూజ్యదశరథులు గతించిరి. సీతారామలక్ష్మణుల వనవాసకారణము తెలియదు బాబు.

భర :- ఏమి ? అన్నగా రరణ్యము వెళ్ళిరా : (రెట్టింపు మూర్ఛ)

దేవ :- ఊరడిల్లుడు : ఊరడిల్లుడు,

భర :- తీవ్రదాహార్తి నె ల్లెడ దిరిగి తిరిగి
యెండిపోయిన నది గూర్చి యేగి నట్టు
లింత కాలాన కార్తిమై యేను వచ్చి
తండ్రి యన్నయు లేనయోధ్యకు జనుదునె.

సమగ్రముగా విన్నచో స్థైర్యము కలుగును. కాన నంతయు వివరింపుడు.

దేవ :- వినుడు : మహారాజుగారు శ్రీరామచంద్రు నభిషేకింప బో నుండ తమతల్లిగారి ట్లని రట—

భర :- ఉండుము.

ఓలి దలంచి దుష్టముగ,
సుర్విపతిత్వము గోరి పుత్రుకై,
జాలియు లేక, ధైర్యము ప్ర
శాంతత గూర్పగ, రాము కానలన్

ద్రోలఁ దదంగవల్కలము
దుస్సహమైన కను రాజుగుండెయున్
వ్రీలగ, దల్లి దిట్టు కర
ణిం బ్రజ నన్నును దిట్టకుందు రే.
(మూర్ఛపోవును)

(తెరలో)

రండు, తల్లులారా! రండు.

దేవ :- (చూచి) ఓహో!

అజలమయమైన యట్టి జలాంజలి కద
జనని ప్రేమార్ద్రహస్తసంస్పర్శనమ్ము,
సుతుడు పెన్మూర్ఛ మున్గి తా సోలి యుండ,
తగిన సమయాన వచ్చిరి తల్లు లిపుడు.

(దేవులు, సుమంత్రుడు ప్రవేశము)

సుమం :- ఇటు దయ సేయుడు!

ఇద్ది ప్రతిమాస్వరూపు డౌ నినకులేశు
మనికి, సౌధోన్నతిని మీరి యున్నతమ్ము.
కూడ దనుమాట, ద్వాఃపాలకులము రద్ది
పిరికిదండాలు లేక సేవింతు రి ప్రజలు.

(లోనికి పోయి చూచి) తమరు లోనికి పోరాదు. ఉండుడు.

ఈత డెవ్వడో యువకు డీ ట్లిలనుబడియె?
రాచకొమరుడై యునిపించు లక్షణముల

దేవ :- వలదు శంకింప సీతడు పరుడు కాడు
వత్స భరతుడె! యినకులవర్ధనుండు.

(నిష్క్రమింతురు)

దేవులు :- (త్వరగ సమీపించి) నాయనా! భరతా!

భర :- (కొంచె మూరడిలి) అయ్యో!

సుమం :- జయము మహా...(సగమున నాపి విచారముతో)
పలుకుబడిపోలిక చే భ్రమపడితిని. ప్రతిమాహూప్రులైన మహారాజుగారు మాట్లాడుచుండి రనుకొంటిని.

భర :- అయిన నిప్పుడు తల్లు లెట్టియవస్థలో నున్నారు?

దేవు :- బిడ్డా! ఇది మా యవస్థ.

(ముసుగు తీయుదురు)

సుమం :- కలత నొందకుడు తల్లులారా!

భర :- (సుమంత్రుని జూచి) సమస్తాప్తజనోచితాచారమును బట్టి పూజ్యులైన సుమంత్రు లని తోచెడిని.

సుమం :- అవును నాయనా! సుమంత్రుడనే.

పెద్దబ్రతుకుట దోసగుల పెరిగినాడ,
పరిహాసితుడ గృతఘ్నతాభావవశత,
నట్టి యీ రాజె యట్లు కా నిట్టు లేను
శూన్యరథచోదకుండనై సుఖము మనుదు.

భర :- హా! తండ్రీ! (లేచి) పాదాభివందనక్రమము తెలియగోరుచున్నాను.

సుమం :- బాగు ! ఈమె మహాదేవి కౌసల్య. పూజ్య శ్రీరాముజనని.

భర :- అమ్మా ! నిర్దోషిని. వందనములు.

కౌస :- బిడ్డా ! విచారపడకుము.

భర :- (తనలో) ఆకర్షింపబటి నట్లయితి (ప్రకాశముగా) అనుగ్రహింపబడితిని. తరువాత.

సుమం :- పూజ్య లక్ష్మణుజనని సుమిత్రాదేవి యీమె.

భర :- అమ్మా ! లక్ష్మణునిచే వంచింపబడిన భరతుడు నమస్కరించుచున్నాడు.

సుమి :- కీర్తిమంతుడవు కమ్ము నాయనా !

భర :- అమ్మా ప్రియత్నింతును, అనుగ్రహింపబడితిని. తరువాత— తరువాత—

సుమం :- ఈమె మీా తల్లి.

భర :- (రోషముతో లేచి) దురాత్మురాలా !

ఈమె మాయమ్మ, మాయమ్మ యీామె, మధ్య
నీ వెవర్తవు? సిగ్గుచే టింక లెమ్ము.
గంగ యమునల మధ్యలో కలుషితాంబు
వాహినీప్రవేశమున దుష్ఫలమ కాదె !

కైక :- బిడ్డా ! నే నేమి చేసితిని ?

భర :– ఏమిచేసితి నందువా!

నా కపకీర్తి, యన్నకటు
నారలు, భర్తకు జావు నింటనే,
పోక సుమిత్రసూతి మృగ
పోతములం బడి, యే డ్వ యోధ్య నే
కాకృతి, మార్గఖేదమున
హా! యను కోడలు, నమ్మ లిద్దఱ్
శోకము గూరియుంట ప్రియ
సూనులకై, ప్రజ 'ఛీ' య టంట నిఁ.

చాలదా! ఇం కేమి చేయవలె?

కైక :– నాయనా! సమస్తసదాచారజ్ఞుడవు మాతృ వందనము చేయ వేల.

భర :– మాతయా, మాత. నీ వే నా తల్లివి. నీకు న మస్కృతులు.

కౌస :– కాదు, కాదు. ఈమె మీ యమ్మ.

భర :– ఒ కప్పుడు; ఇప్పుడు కాదు.

ఎంతకు లేరు స్త్రీ లిలను,
హీనపు టూహల దుష్టశీలసం
క్రాంతము లైన దోషముల
గాకనుపోదురు కన్నవారికిఁ

చింతయె లేక, నాధునకు
చేయుచు ద్రోహము, తల్లి తల్లికా,
దింత సహింపజాల నిక
నిర్వర నిల్పుదు క్రొత్తపద్ధతిన్.

కైక :- బిడ్డా! మహారాజుగారి సత్యవచనము పాలించుట కై యట్లు పలికితిని.

భర :- ఏ మని ?

కైక :- నా బిడ్డ రాజు కా వలె నని.

భర :- అయిన పూజ్యులు రామచంద్రులు నీపుత్రులు కారా ?

ఆత్మజుడు కా డొకో తాను నవనిపతికి ?
క్రమము లే దొక్కొ పట్టమ్ము కట్టుటందు ?
ధరణిజనమున కిది రుచికరము కాదె ?
యన్నదమ్ముల సామరస్యమ్ము లేదె ?

కైక :- బిడ్డా! శుల్కలోభమున నట్లు చేసితిని.

భర :- రాజ్యపదవియు తొలగి నారలను గట్టి
పత్నితోడుత కాల్నడ వనికి నేగి
పదియునాల్గేండ్లు కష్టాలపడవలయుట
శుల్కవిషయమ్మొ కాబోలు పల్క కింక.

కైక :- నాయనా! అదనుజూచి నెమ్మదిమీాద తెల్పుదును

భర :- అపయశ మన్న గోర్కె కల
దా మఱి నాదుప్రస క్తి యేల ? రా
జ్యపుసుఖభోగసంతతుల
కాస యొనర్చితో ? భ ర్త యీయడే ?
నృపజనయిత్రియన్న పద
మిష్టము దైనదా ! దైన సత్య మిం
క పలుకు మన్న రాముడును
గా డొక పుత్రుడు నీకు జూడగన్.

ఎంత తప్పుపని జేసితివి !

పతి యసువుల్ త్యజించుటయు
పట్టదు నీమది రాజ్యకాంక్ష, బం
పితి వటు జ్యేష్ఠు నిర్దయను
భీకరకాననభూమి నుండ, జూ
చితి జనకాత్మజాతయును
చిక్కని వల్కలముల్ ధరింప, వ
జ్రిత హృదయమ్ము చేసె నొకొ
స్రష్ట పెరిల్లని ప్రీలిపో నటుల్.

సుమం :- వసిష్ఠ వామదేవులు ప్రజలతో గూడి నిన్ను భి
క్షింప వచ్చి విన్నవింపు చున్నారు.

కాపు లే నట్టి గోవులు కష్టములకు
నెట్టు గురియాచు నశియించు నట్టు లగుచు
రాజు లేనట్టి రాజ్యాన ప్రజలు మిగుల
దుఃఖభాజను లై చెడుదురు నశించి.

ప్రతిమ

భర :- మంత్రులు న న్ననుసరింతురుగాక.

సుమం :- అభిషేకము వీడి యెచ్చటకు పోదువు?

భర :- అభిషేకమా! ఎవరికి? ఈమెకు చేయుదు.

సుమం :- నీ వెచ్చటికి పోదువు?

భర :- ఎచట లక్ష్మణప్రియు డైన యినకులేశు
డలరు నచ్చటి కేను పోగలను నిక్క
మన్న లే నట్టిది యయోధ్య యగునె యెట్లు
ఆత డెందు నున్న నయోధ్య యదియెగాక.

(అందఱు నిష్క్రమింతురు)

ప్రతిమ

చతుర్థాంకము

(ఇద్దఱు చెలులు ప్రవేశింతురు)

విజయ :– చెలీ నందినికా! చెప్పుము. నేడు కౌసల్యా పురస్సరముగా సర్వాంతఃపురమును ప్రతిమాగృహము జూడ బోయి, యచ్చట రాజకుమారుని భరతుని జూచెను. దురదృష్టవంతురాలను నేను ద్వారముననే యుండవలసి వచ్చినది.

నంది :– మే మందఱమును గోర్కెదీర రాజకుమారు భరతుని జూచితిమి. చెలీ!

విజయ :– రాజకుమారు లే మనిరి?

నంది :– ఏమి చెప్పుదును. చూచుటకుగూడ నిచ్ఛగింపరు.

విజ :– అయ్యో! కొంప మునిగినది: రాజ్యకాంక్ష చే రామచంద్రుని పదవీభ్రష్టుని జేసి, తనకు వైధవ్యము తెచ్చికొనినది. లోకమునుగూడ నాశము చేసినది. ఎంత నిర్దయురాలు రాణిగారు.

నంది :- చెలీ ! వినుము. మంత్రులచే సిద్ధము చేయబడిన యభిషేకమును విసర్జించి, శ్రీరామచంద్రు డున్న తపోవనమునకు భరతకుమారు డరిగె.

విజయ :- (విచా రాశ్చర్యములతో) ఆ ! అట్లు వెడలెనా భరత కుమారుడు ! మనము భట్టినిని చూతుము రమ్ము.

(నిష్క్రమించుదురు)

(ప్రవేశకము)

(తరువాత భరతుడును, రథముతో సుమంత్రుడును, సారథియు ప్రవేశింతురు)

భర:- నరపతి పుణ్యసంపదను
నాకము జూడగ నేగె నింక నే
బురజను లార్తులై కనుల
జోరున నశ్రులు రాల్చుచుండగా
నరుగుదు పుణ్యకాననము
లందున గాంచగ రామనాము డై
పరగెడు నవ్యచంద్రము న
పారజగత్సుఖశాంతి కారకున్.

సుమం :- ఇదుగో ! ఆయుష్మంతుడు భరతకుమారుడు

తనయుడు దానవాధిపుల
దర్ప మడంచిన శౌర్యరాశికిన్
మనుమడు సర్వసంపద స
మంచితయాగవిధిన్ ద్యజించు స

ద్వినుతునకుఁ జగత్ప్రియుని
పిత్రభిలాషను దీర్చునట్టి రా
మునికిని తమ్ము డీత డగు
పూనెను రాముని సాటిమార్గమే.

భర :- ఓ తాత !

సుమం :- వచ్చుచున్నాను నాయనా !

భర :- నా పూజ్యరామచంద్రు లెక్కడ ? మహారాజులకు ప్రతినిధియైన రాము డెక్కడ? సారవంతులకు లెస్సగు నుదాహరణ మెక్కడ ? రాజ్యలుబ్ధ యగు కైకకు బుద్ధిచెప్పిన ప్రభు వెచట ? యశోభాజను డెక్కడ ? రాజకుమారు డెక్కడ ? ఎక్కడ సత్యపాలకుడు ?

స్వార్థ విషపూరితాత్మ యస్మజ్జననికి
తృప్తి యొనరింప రాజ్యము నెవడు వీడె?
పరమదైవము నా పాలిప్రభు వెవండో ?
అట్టి మహానీయు గాంచగా నార్తి గొంటి.

సుమం :- నాయనా ! ఈ యాశ్రమమున—

శీలము సత్యము భక్తియు
లీలగ రూపమ్ము నొందు రీతిని గనుమా
మే లగు కీర్తి పదమ్ములు
లాలితభూజాత రామ లక్ష్మణు లరుగో !

భర :- అయిన రథ మాపుము.

సూత :- చిత్తము (అట్లు చేయును)

భర :— (రక్షము దిగి) సూతుడా! గుఱ్ఱములను స్వేచ్ఛగా వదలుము.

సూతు :— చిత్తము (పోవును)

భర :— తాత! తెల్పుము : తెల్పుము!

సుమం :— నాయనా! ఏమి తెల్పవలె?

భర :— రాజ్య లుబ్ధయైన కైకపుత్రుడు భరతుడు వచ్చెనని.

సుమం :— గురుజననింద వలదు నాయనా!

భర :— బాగు! పరదోషోద్ఘాటనము న్యాయముకాదు. కాన, ఇక్ష్వాకుకులకళంకభూతుడు భరతుడు దర్శింపగోరు చున్నాడని చెప్పుము.

సుమం :— ఇట్లు నేను చెప్పజాలను. కాకపోయిన భరతుడు వచ్చెనని చెప్ప గలను.

భర :— వలదు. వలదు. పేరుమాత్ర ముచ్చరించిన దోష ప్రాయశ్చిత్తము చేసికొనినట్లు తోపదు. బ్రాహ్మణ హంతకునిరాక తెలుపుటకుగూడ వేరొకరు వలయునా! కావున ఆగుము. నేనే తెల్పికొందును. ఎవ రక్కడ? పితృవాక్యపరిపాలకు డైన పూజ్యరాముకు తెల్పుడు.

"ద్రోహమతి కృతఘ్నుడు ప్రియసాహసుండు
ప్రాకృతుడు నయ్యు నెనలేని భక్తిపరుడు
ఒక్కడిట మీదుదర్శన మొందగోరు
చుండు మందురో పొమ్మందురో తెలుపుడు."

అని.

(తరువాత సీతాలక్ష్మణులతో రాముడు ప్రవేశము)

రాము :- (విని సంతోషముతో) లక్ష్మణా! విందువా!
జనకరాజపుత్రీ! నీవును వినుచుంటివా!

ఎవరి స్వరమిది జనకసదృశ తరమ్ము
మేఘనాదము మించు గాంభీర్యమునను
బంధు వను భ్రాంతి ప్రేమమై వరల హృదిని
స్వేచ్ఛగా జొచ్చె వీనుల విం దెసంగ.

లక్ష్మ :- అన్నా! నాకుగూడ నీ స్వరసంయోగము చుట్ట మను నాస కల్గించు చున్నది. ఇది—

సాంద్రగంభీరసుస్పష్ట నాద మ్మిది
మద వృషభస్నిగ్ధ మంజులమ్ము
మృదులమై కంఠాన హృదయ మందున నడ్డు
లేని సంచారమ్ము నూని నదియు.
తగుతానయత్నాల తగురీతిగా నొంది
విస్ఫుటాక్షరముల వెలయు నదియు
నై నాల్గు వర్ణాల కభయమిచ్చుట కేమొ
యన్నట్లు యత్నమ్ము నందినదియు
నైన నీ స్వర మేరిదో యలర జేయు
బంధుజను లదె యన్నట్టి భ్రాంతి గొలిపి
యగణితం బైన బహుమాన మాత్మగొలుపు
నేమిచిత్రమొ కనుదాక హృది నిలువద!

రాము :-ఇది అన్యుల దేహమాత్రమును కాజాలదు. తప్పక బంధుజనముస్వరమే కావలయు. హృదయమును వేగి

రించి కలత పెట్టుచున్నది. లక్ష్మణా! కొంచెము మరసి రమ్ము.

లక్ష్మ :–చిత్తము (ముందునకు పోయి నలువైపుల జూచి)

భర :–అయ్యో! ఎవ్వరును సమాధానమీయరే! కైకేయి పుత్రుడైన భరతుడనని యెరిగియుంటచేతనై యుండునా!

లక్ష్మ :– (చూచి) అరే! ఈతడు పూజ్యుడైన యన్న రాముడే. కాదు – కాదు. దగ్గఱపోలిక.

రాముని మోముకాంతి మృగ
లాంఛను పూర్ణతృత సాటిలేని దా
మోము సురారిబాణహతి
పొందిన తాతవిశాలవక్షమున్
ధామవృతాంగ మొప్పు రుచి
ధాముడు లోకమనోజ్ఞదర్శనుం
డీ మహనీయమూర్తి దివి
జేంద్రుడొ ? తా మధుసూదనుం డొకో ?

(సుమంత్రుని జూచి) ఆహా! తాతపాదులు వచ్చిరే ?

సుమం :–ఆహా! కుమార లక్ష్మణుడా!

భర :–(లక్ష్మణుని జూచి) అన్నగారు రరుగో! ఆర్య : వందనములు.

లక్ష్మ :–రమ్ము నాయనా! చిరంజీవివి గమ్ము! (సుమంత్రుని జూచి) తాత! ఈత డెవరు? (భరతుని జూచి)

సుమం:-కుమార !

మునిమనుమండు గాడె రఘు
భూపతికి న్నజభూమిజానికిన్
మనుమడు గాడె, మీ జనకు
మై పులకింపగ జేయుబిడ్డడే,
యనుజుడు మీదువంశమున
కాభరణం బగు నీదునన్నకున్,
మన భరతుండు గాడె యను
మానము సేసెద వెందు కింతయున్.

లక్ష్మ :- రమ్మా! రమ్మా! ఇక్ష్వాకుకులవర్ధనా! నీకు శుభమగు! చిరంజీవివిగమ్మా !

అసురుల నాజి నోర్వగల
యట్టిరు వజ్రసమానచాపులు
న్నసమబలాఢ్యులైన భవ
దన్వయజాతుల వీర్యసంపద
న్నెసగి జగంబునన్ గుణుల
యిద్ధగుణమ్ముల కాకరంబ వౌ
ము సవనమందు సర్వధన
ము న్వెలయించు రఘుప్రభుక్రియన్.

భర :- అనుగ్రహింపబడితిని.

లక్ష్మ :- తమ్ముడా! యిట నుండుము. నీరాక యన్న కెరిగింతును.

భర :- ఆర్యా! ఇప్పుడే నమస్కరింప నాత్రపడుచున్నాను. త్వరలో తెల్పుడు.

లక్ష్మ :- బాగు! (సమీపించి) ఆర్యులకు జయము. ఆర్య!

అద్దమున మీద ప్రతిబింబ మట్టులలుగ
నచ్చముగ మీదు రూపమ్మె యబ్బురముగ
మనల కూరిమితమ్ముడు కనుడు వాడె.
భ్రాతృగౌరవయుక్తుడు భరతు డనఘ!

రాము :- బిడ్డా! లక్ష్మణ! ఏమీ భరతుడు వచ్చెనా?

లక్ష్మ :- చిత్తము.

రాము :- జానకి! భరతుని జూడ గనుగవ బెద్దచేయుము.

సీత :- స్వామి! చిరంజీవి భరతుడు వచ్చెనా?

రాము :- అవును; జానకి!

భ్రాతృగౌరవ మింతయై రాజ్యము విడ
పుత్రవాత్సల్య మెంతయో పోల్పగలమె?
ఎంత యయ్యెనో ననుగూర్చి వంత దండ్రి
యిపుడు గాంచగ గల్గితి నిందు నిజము.

లక్ష్మ :- అన్నా! భరతుని ప్రవేశపెట్టు మనెదరా?

రాము :- ఇందును నా యభిప్రాయమునకై యెదురుచూచు చుంటివా? నాయనా! వెంటనే ప్రీతిమై గొనిరమ్ము.

లక్ష్మ :- చిత్తము.

రాము :- పోనిమ్ము : నీ స్వప్నము.

కలువ రేకుల నునుమంచుకణము లట్లు
హార్షజలమును వర్షించు నసగ గనుల
మాతృవాత్సల్యపూరితచేత సీత
యేగుగావుత మాదర మెసగ దానె.

సీత :- ఆర్యపుత్రులు సెల విచ్చినట్లే! (లేచి అంతట కలయజూచి భరతునిజూచి) ఆర్యపుత్రు లిపుడే కదా యక్కడుండిరి. అప్పుడే యిచటి కెట్లు వచ్చిరి ? ఆహా! పొరపాటు : దగ్గఱిపోలికచే భ్రమపడితిని.

సుమం :- ఆ! వధువు జానకియా!

భర :- (ఆశ్చర్యముతో) ఆహా! ఈమె పూజ్యురాలైన జనకరాజనందినియె!

సన్నిదర్శన మన నొప్పు జనకవిభుని
సత్తపమ్మున కట్టి యీసాధ్వి మున్ను
పుడమియుదరాన నాగేటిమొనను వెడలి
దివ్యతేజము రూపొందె స్త్రీమయమ్ము.

అమ్మా! నమస్కారము; నేను భరతుడను.

సీత :- (తనలో) ఆకారమే కాదు. స్వరమునదియే. (ప్రకాశముగ) నాయనా! చిరంజీవివికమ్ము!

భర :- ధన్యుడను!

సీత :- రమ్ము నాయనా! అన్నగారికోర్కె తీర్పుము.

సుమం :- పొమ్ము నాయనా!

భర :- ఇచట మీ రేమి చేయుదురు ?

సుమం :- రవికులేశుడు స్వర్గ మలంకరింప
సకనిపాతసమమ్మగు నట్టివార్త
కోరి మున్నను పోయి వాక్రువ్వలేను
రాము డెరిగిన పిమ్మట రాగల నట.

భర :- అటులే కానిండు. (రాముని సమీపించి) ఆర్య! భరతుడ నమస్కరించు చున్నాను.

రాము :- (సంతసమున) రమ్ము నాయనా! ఇక్ష్వాకు కుమార! రమ్ము! స్వస్తి యగుగాక! చిరంజీవివికమ్ము.

రమ్ము కవాటతుల్యము ను
రమ్ము నురమ్మున జేర్పుమయ్య ; యం
ది మ్మిటు కౌగిలింప భవ
దీయ సుదీర్ఘభుజద్వయమ్ము నూ
ర్ధ్వ మ్మొనరింపు కొంచెము శ
రచ్ఛశిసన్నిభ మైన నీదు వ
క్త్రమ్మును పోయిగూర్పగదె
కాయము దీనిని దుఃఖదగ్ధమున్.

భర :- ధన్యుడను.

సుమం :- (సమీపించి) చిరంజీవులకు జయ మగు గాత!

రాము :– హా! తాత!

సాటి విమానపంక్తులను
    సైనికాళిఁ గొని ప్రజాసేతఁ డా
మేటి యటన్న ఖేచరుల
    మే ల్నుతు లందె నవుడు, దైత్యాళిఁ
గోటనుమీటు నావిభుడు,
    కూరిమిమిత్రుని, స్నేహపాత్రుఁ, సే
మాటయు దల్ప కేగె దివి,
    త్మాపులగూడి ముదంబు నందగా.

సుమం :– (శోకముతో)

ప్రభునిమరణమ్ము, నీ యున్కి వనము నందు,
కులముదైన్యము, భరతు నాకులత యున్ని
పలుతెరంగుల గారించె పట్టి నన్ను
చిరము నామన్కి గుణ మీగి చేటుగూర్చె.

సీత :– అసలే దుఃఖమున మున్గిన స్వామి నింకను దుఃఖపెట్టుచున్నారే తాత!

రాము :– మైథిలీ! ఇక కొంచె మూరడిలుదును. తమ్ముడా! లక్ష్మణా! కొంచెము మంచినీ రిమ్ము.

లక్ష్మ :– చిత్తము.

భర :– ఆర్య! ఇది న్యాయముకాదు. క్రమము ననుసరించి శుశ్రూష చేయుదుము. నేను పోయెదను. (పాత్ర తీసికొనిపోయి మరలి వచ్చి) ఇదిగో జలము.

రాము :- (ఆలోచించి) మైథిలీ! లక్ష్మణునిపని కష్టము కల్గినది.

సీత :- ఆర్యపుత్ర! భరతుడుగూడ శుశ్రూష చేయదగిన వాడే కదా!

రాము :- ఇచట లక్ష్మణుడు చేయుట యుక్తము. అచట నయోధ్యయందు భరతుడు చేయుట ధర్మము.

భర :- అనుగ్రహింపుడు.

తనువు మీపాదసన్నిధి దనరు నిచట
పను లయోధ్యను చేయుదు భక్తిమీర
రక్ష సేయుదు మీపేర రాజ్య మెల్ల
నేను మీ కింకరుండను నిక్క మిదియు.

రాము :- నాయనా! కైకేయీనందన! అట్లనకుము.

జనకునానను వచ్చితి వనమునకును
గాని భయగర్వవిభ్రాంతి కలనగాదు
మనకొలమ్మున సత్యమే ధనము తెలియు
కాని తెన్నున పోవగా నౌనె నీకు.

సుమం:- ఇప్పు డభిషేకజల మెచట నుంపవలెను?

రాము:- మాతల్లి యభీష్ట మెచ్చటనో యచ్చటనే.

భర :- కరుణింపుము. అన్నా! ఇంకను వ్రణము పై కారము చల్లెదవా!

నీకు జని యెందు నందునే నాకు ననఘ!
నీవు ధీశాలి యా తండ్రి నాదుతండ్రి

తల్లి త ప్పాకతప్పుగా దలప నగునె
వరద! ము న్నాలె గాంచుము భరతు నార్తు.

సీత :- ఆర్యపుత్ర! కడు దుఃఖితు డగు భరతుని కరుణ జూడుడు. ఇప్పుడేదో తమ రాలోచించు చున్నట్లున్న దే!

రాము :- మైథిలీ!

ఇటు గుణ సుందరుం డయిన
యీ తనయున్ కనులార జూడకే
యటు సురలోక మేగిన ధ
రాధిపు గూరిచి చింత సేయుదున్
కటకట! ఇట్టి సద్గుణుల
గాంచిన యుత్తమపూరుషాళికే
న్నటులవిధిప్రభావ మది
శక్యముగా దొకో దాట నింద్యమా!

నాయనా! కైకేయి నందనా!

నిక్కము సంతసించితిని
నీవు విశుద్ధమనస్కు డౌదు నీ
వాక్కుల కేను లోనయితి
భవ్యగుణమ్ములు నీవి గెల్చె న
న్నొక్కటి చూడు మైన విభు
నూర్జితవాక్యనృతమ్ము చేయ నౌ
న్నొక్క భవాదృశుం గనిన
యుత్తముడౌనె యసత్యభాషి తాన్.

భర :—

ఎందాకస్ సమయావధిన్ ప్రభువ! నీ
విం దుండు వందాక నే
నుందు న్నీ పదపద్మ మూలమున సం
యుక్తాత్మతన్

రాము :— కా దటుల్.

పొందున్ గావుత తండ్రివాంఛితమునుం
బ్రాకృణ్య పాకమ్మునన్
సందానించితి నాన నీకు, ధరణీ
సంరక్షకుఁ దప్పినన్.

భర :—అయ్యో! నిరుత్తరుని జేసెనే! అటులనే : ఒక నియమముపై మీరాజ్యము పాలింతును.

రాము :—ఏమది ? చెప్పుము నాయనా!

భర :— ఇప్పుడు నాచేత నిడిన రాజ్యము పదునా ల్గేండ్ల యనంతరము మరల మీరు గ్రహింపవలె.

రాము :— అటులనే కానిమ్ము.

భర :— ఆర్యా! వింటిరా! అమ్మా! వింటివా! తాత! వింటిరా!

అందరు :— మేమందరమును వింటిమి.

భర :— మరియొక వరము కావలెను.

రాము :— చెప్పుమునాయనా! నేనేమీయవలెను? నేనేమి యనుష్ఠింపవలెను ?

భర :-

మీదుపాదాలు నెలకొన్న పాదుకలను
మ్రొక్కువాడను నా కిందు మూర్ధమునను
కార్యసంసిద్ధి మీరు రా గలుగుదనుక
వీనినే దాసు డౌచు సేవించువాడ.

రాము :- (లోన) అహో!

పెద్దకాలమ్ము నాచేత పెంచబడిన
యేకొలందియొ యశ ముస్ననిపుడు దాని
రెప్పపాటైన లేకుండ లీలమొయిని
సంగ్రహించెను భరతుడు శాశ్వతముగ.

సీత :- స్వామీ! భరతుని మొదటికోరికను మన్నింపుడు.

రాము :- అటులనే! నాయనా! కైకొమ్ము. (పాదుకల నిచ్చును).

భర :- అనుగ్రహింపబడితిని. (చేకొని) ఈ పాదుకల కభిషేకము చేయగోరుదును.

రాము :- తాత! భరతునియిష్ట మెల్ల తీర్పవగు.

సుమం :- చిత్తము.

భర :- (తనలో) అహో!

బంధుజనాళి విశ్వాసపాత్రుడ నైతి
పౌరవర్గప్రేమ పాత్రుడైతి
లోక మాసక్తి నాలోకింప ననువైతి
గుణు లన్నదమ్ముల కూర్మిగంటి

ఆశాంతవిశ్రాంత మహా చిరకీర్తికి
పంటపొలమ్ము నైన వరలినాడ
సచ్ఛరిత్రల పేర్మి సంభాషణమ్ముల
కాధారవస్తువై యలరినాడ
రామపట్టాభిషేకసంప్రాప్తి ప్రియత
జెలగువారల ప్రేమమ్ము చెందగంటి
సాధుశీలుడు స్వస్థుడౌ జనకునకును
కూర్మిబిడ్డడనైతి నాకోర్కె దీర.

రాము :- బిడ్డా! కైకేయీనందనా! రాజ్యము త్రుటికాల మైన నుపేక్షింపదగనిది సుమా! అందుచే విజయము నకై శీఘ్రమే వెడలుము.

సీత :- ఆహా! భరతకుమారు డిప్పుడే వెడలుచుండెనా?

రాము :- అతిస్నేహము బయలుపరుపకుము. ఇప్పుడే చిరంజీవి విజయమునకై పోవలెను.

భర :- ఇప్పుడే నేను పోయెదను.

గంపెడాసను మిమ్ముల గాంచుకొఱకు
కనులు నెఱవిచ్చి నిలుతురు జనులు పురిని
మీదుకరుణను దొరకిన పాదుకలను
చూపి వారల సంతృప్తి జూచువాడ.

సుమం :- వత్సా! ఇప్పుడు నా కర్తవ్య మేమి?

రాము :- మహారాజుగారివలెనే కుమారునిగూడ సంరక్షించునది.

సుమం :- ఆయు వున్న నట్టులే చేయయత్నింతును.

రాము :- నాయనా! భరతా! నా యెదుటనే రథమునెక్కుము.

భర :- చిత్తము. (రథ మెక్కును)

రాము :- సీతా! ఇటు రమ్ము; లక్ష్మణా! ఇటురమ్ము. ఆశ్రమ ద్వారమువఱకైన భరతుని పంపుదము.

(అందఱు నిష్క్రమింతురు)

చతుర్థాంకము సమాప్తము.

ప్రతిమ

పంచమాంకము

(తరువాత సీత - తాపసి ప్రవేశము)

సీత :- పూజ్యురాలా! పూజాపుష్పములతో నిండిన యాశ్రమస్థలి శుభ్రమైనది. ఆశ్రమలబ్ధవైభవముతో దేవతాపూజయు నిర్వర్తింపబడినది. ఆర్యపుత్రులు రాకపూర్వమే యీ లతికలకును, వృక్షములకును నీరు వోయుదును.

తా :- ఆటంకములు కలుగకుండుగాక.

(తరువాత రాముడు ప్రవేశించును)

రాము :- (దుఃఖముతో)

జనకుడు నేను లేనియది
చక్కనిదైన యయోధ్య వీడి నా
కునె ధరఁ గట్ట పట్టమును
గూర్చి సమస్తము నన్నుఁగూర్చి వ

చ్చిన సుగుణాకరుఁ భరతు
శీఘ్రమ పంపితి వీటిరక్షకై
ఘన మగు రాజ్యభారము నొ
కం డయి బాలుడు పూనె నక్కటా!

(విమర్శించి) అవు నిట్టిదే కదా రాజ్యతంత్రము! ఇప్పు డీ దుఃఖోపశమనమునకై సుఖదుఃఖసమభాగిని యగు మైథిలిని కలిసికొందును. ఎచ్చటికి పోయి యుండును జానకి? (నలువైపుల పరికించి చూచి) ఈ వృక్షముల కిప్పుడే నీరు వోసిన ట్లున్నది. ఆమె యీ ప్రాంతముననే యుండి యుండ వచ్చును. అవును. అక్లే.

పాదులనిండ నుర్వ్యగల
వారి చలించుచు నుండె, దప్పిచే
వేదనగొంచు వచ్చియును
విష్కిరముల్ మలినాంబు వానవుఁ
ఈదుచు కల్గులఁ వెడలి
యెండిన నేలకు నేగు కీటముల్
పాదులు క్రొత్త గొన్నవియు
పాదపముల్ జల మింకు చారచే.

(చూచి) ఇదిగో వైదేహి! అయ్యో!

అద్దము పూనుమాత్రమున
హస్తము గందెడు నీమె, నేడయో!
పెద్దఘటంబు మోయుచును
వెక్కసపాటును జూప దింత, లే

మునిజనగూఢ మోటతన
ముం గను నిండు, లతాంగనల్ బలెన్
ప్రస్థిత ! నాజ మీా వనము
సంపద వృద్ధుత్వము వోవు టన్ననున్.

(సమీాపించి) మైథిలి !తపమ్మునకు భంగము లేదుకదా!

సీత :- (ఆశ్చర్యమున) అహో ! ఆర్యపుత్రుడు వచ్చెనే! జయ మార్యపుత్రునకు.

రాము :- ఏ ధర్మకర్మాచరణమున కంతరాయము కానీచో నించుక కూర్చుందుము.

సీత -: చిత్తము : (కూర్చుండును)

రామ :- జానకీ ! ఏదో యడుగదలచుచున్న ట్లున్నావు?

సీత :- దుఃఖముచే శూన్యహృదయు లై నట్లు మోము చందము కన్పట్టును. కారణ మేమి?

రామ :- అవును. తగినవిషయమును గూర్చియే విచారము-

యము విశిఖప్రఘాతమున
నార్తిఁ గలంగిన నాదుదేహ మం
దమరె ఘనవ్రణమ్ము హృద
యమ్మున నూత్నతరమ్ము ఘోర మై
క్రమముగ నా వ్రణమ్మునకె
గాటముగా బలుమోమువన్నెలన్
దమి గొని దుఃఖబాణములు
తాకును దాకును దృప్తిలేనటుల్.

సీత :- ఆర్యపుత్రుని దుఃఖకారణ మేమి ?

రాము :- రేపు పూజ్యు లగు తండ్రిగారి సాంవత్సరిక శ్రాద్ధము. యథావిధిగా తిలోదకాదులను బితరులు కోరు చున్నారు. దాని నెట్లు నిర్వర్తింపగలనా యని చింతించు చున్నాను. లేదేని-

ఏ నొసంగిన దే దైన గాని పితలు
తృప్తినొందుదు రీశళ నెఱిగియుంట
నైన రాముడ కిక్ష్వాకు లధిపునకును
తగిన విధమున బితృపూజ నొగి నొనర్తు.

సీత :- భరతకుమారుడు మహావైభవముతో జేయును. మనకు దగినవిధముగా మీరు సేయుడు. ఇది పితృపాదు లకు మిక్కిలి ప్రియ మగును.

రాము :- కుశలపైననె మనచేత గూర్పబడిన
ఫలములను గాంచి విభవమ్ము తలగు టెరిగి
మనదు దుస్థితి, వనవాసమును స్మరించి
తండ్రి నాకమ్మునం గూడ దగులు నార్తి.
(తరువాత సన్యాసివేషమున రావణుడు)

రావణు :- మనము వశమ్ముకా, దయిన,
మాయశరీరము దీని దాల్చి, రా
ముని ఖరు జంపు వైరమున
మోసము సేసి, హరింపవచ్చితిన్

జనకక్ష్మాపాలు కూర్మిసుత
    జానకి, నను ప్రేరక మైన హావ్యథా
నిను జెరె, గాశలమ్మన గ
    నమ్మ మెలంగుదు గార్యసిద్ధికై.

(ముందునకు పోయినలువై పుల జూచి) ఇది రాముని యాశ్రమపదద్వారము. ఇచట దిగుదును. (దిగును) అతిథికి తగిన మర్యాదను పాటింతును. నే నతిథిని. ఎవ రక్కడ ?

రాము :- (విని) అతిథికి స్వాగతము.

రావ :- బాగు ! స్వరముచే రూపము సుందరతర మైనది.

రాము :- (చూచి) ఓ భగవంతుడా ! నమస్కారము.

రావ :- శుభ మగు గాక.

రాము :- స్వామి! ఇదిగో ఆసనము. కూర్చుండుడు.

రావ :- (తనలో) ఏమి! ఈతనిచే నాజ్ఞాపింపబడిన ట్లయితిని! (ప్రకటముగా) బాగు. (కూర్చుండును)

రాము :- పూజ్యులకై పాద్యము తెమ్ము.

సీత :- చిత్తము. (పోయివచ్చి) ఇదిగో జలము.

రాము :- స్వామికి సేవచేయుము.

సీత :- చిత్తము. (పాదములు పట్టి నమస్కరించును)

రావ :- (మైథిలీస్పర్శచే సాత్త్వికోదయమున మాయా ప్రకాశనమగునని భయము నొంది) కానిమ్ము, కానిమ్ము.

ఈమె యొకర్తుకయే ధర
లో మనుజగణమ్ములం దరుంధతి చూడన్
ఏమె మనోహరు డని నిను
దా మహితాద్భృతి గని వనితాతతి పల్కున్.

రాము :- (అయిన) నేనే సేవచేయుదును. ఇటిమ్ము.

రావ :- ఛాయనే వదలినప్పుడు తన్మూలమగు శరీరముచే సేవలుగొంట భావ్యమా ? వాగ్రూపమైనదే కదా అతిథి సత్కారము! చాలును; చాల గౌరవింప బడితిని. కూర్చుందుము.

రాము :- సాగు. (కూర్చుండును)

రావ :- (తనలో) నేనుగూడ బ్రాహ్మణమర్యాదను పాటింతును. (ప్రకాశముగా) కాశ్యపగోత్రుడ, సాంగోపాంగముగా వేదాధ్యయనము చేసితిని. మనుధర్మశాస్త్రము, మాహేశ్వరయోగశాస్త్రము, బృహస్పతియర్థశాస్త్రము, మేధాతిథిన్యాయశాస్త్రము; ప్రాచేతసుని శ్రాద్ధకల్పమును సమగ్రముగా జూచితిని.

రాము :- ఏ మేమి ? శ్రాద్ధకల్పమా !

రావ :- అవును, మిగిలినవాని నన్నిటిని మించి శ్రాద్ధకల్పముననే మిక్కిలి శ్రద్ధచేసితిని. ఏమి ?

రాము :- కష్టపడకుండ నడచుటచే ఏదియో నాకు తెలుపగ దగిన శాస్త్రము.

రావ :- సంశయమేల! నీ కిష్టమువచ్చిన దాని నడుగుము.

రాము :- స్వామి! తర్పణకాలమున దేనిచే పితృతర్పణము చేయవలెను?

రావ:- శ్రద్ధతో జేసినదంతయు శ్రాద్ధమే యగును.

రాము:- స్వామి! అశ్రద్ధగా చేసినది ముట్టదుగదా! అందుచేత నే ముఖ్యవిషయము లేవో వేనిగూర్చి శ్రద్ధవహింప వలెనో వేని ముఖ్యముగా నర్పింపవలెనో అడుగ గోరుదును.

రావ :- వినుము. తృణములలో దర్భలు, ఓషధులలోతిలలు, శాకములలో కలాయము, మత్స్యములలో మహాశఫరము, పక్షులలో వార్ధ్రీణసము, పశువులలో గోవు, ఖడ్గమృగముగాని, ఇవి మనుష్యులకు జెప్పబడినవి.

రాము :- స్వామి! 'కాని' అని వికల్పముగా జెప్పుటచే నింకే దోకూడ నున్నట్లున్నదే.

రావ :- అవును. శక్తివిశేషముచే సంపాదింప దగినది వే యున్నది.

రాము :- స్వామీ! ఇదియే నానిశ్చయము.

ధనువు తపమును రెండు సాధనము లివిగో
వశ్యములు నాకు నిం దేది వలయుగోనగ
తపము జంకినచోట నీ ధనువు గలదు
ధనువు వెనుకంజ వేసిన దపము గలదు.

రావ :- ఉన్నవి. హిమాలయమున నున్నవి.

రాము :- హిమాలయమునా ! తరువాత ?

రావ :- హిమవంతమున నేడవశిఖరమున సాత్యాచ్ఛివుని శిరమున బడు గంగాజలము త్రాగుచు వైడూర్యముల వలె నీల మైన పృష్ఠములు గలిగి, వాయువేగము గల కాంచనపార్శ్వములను లేళ్లు గలవు. వైఖానసు లైన వాలఖిల్య నైమిశీయాదులు తలపుననే పొంది చంపి, వానితో శ్రాద్ధములు పెట్టుదురు.

వానను నర్చ సేయ పితృ
పాదులు పుత్రఫలమ్ము గాంత్రముగా
కానరు వార్ధకమ్ము, దివి
కై చనుదు ర్గదు దీప్యమాను లై
మానుగ దేవతాగణవి
మానసమానవిమానవాసము
న్నాను వశంబుగారు విష
యాళికి పట్టును బట్టి లాగినన్.

రాము :- మైథిలి !

తనయులయట్లు పెంచిన ల
తాతతితో హరిణాంగనాళితో
వనసఖి, వింధ్య, భూమిరుహ
వర్గముతో జను దంచు దెల్పుమా

[illegible]
　　కాంచనస్తంభముల కెన్నో యనం[illegible]
పసిడి [illegible] భూరుహమ్ములు స
　　వా [illegible] కిష్టమే.

సీత :- విచిత్రము.

రావణ :- కౌసల్యానందన ! ఇంతకొక్కి వలదు. అవి మనుష్యులకు కన్పింపవు.

రాము :- స్వామి ! అవి హిమవంతమున నుండునా ?

రావ :- అవును.

రాము :- అయిన జూతుము.

పసిడికొండల జూపిన బాధలేదు
చూపడో పర్వతేశుడు చూడగలడు
నాదుబాణోగ్రనిహతి వినాశ మైన
క్రౌంచపర్వతదుర్దశ గానియపుడె.

రావ :- (తనలో) ఈతని అహంకారము దుర్భరముగ నున్నదే ?

రాము :- (నలుగడల పరికించి) ఏ మది మెఱపు మెఱసిన ట్లున్నది !

రావ :- (ప్రకాశముగా) కౌసల్యానందనా ! ఇక్కడ నున్నను నిన్ను హిమవంతుడు సమ్మానించు చున్నాడు. అదిగో బంగరు లేడి.

రాము :- స్వామిప్రభావమే యది.

సీత:-ఆర్యపుత్రుల భాగ్యము.

రాము :- కాదు కాదు.

ఇదియు దనయంత వచ్చెనా యెఱుగు మింక
దంద్రిభాగ్యమ్మొగా వేరె తలప నేల ?
దీని నుచితంపు బూజల దృప్తిచేయ
వత్స ! సౌమిత్రి బంపుము భవ్యచరిత !

సీత :- ఆర్యపుత్ర! తీర్థయాత్రకు పోయి తిరిగి వచ్చు కులపతి కెదురేగి కొనిరా బంపితిరిగదా సౌమిత్రిని.

రాము :- అయిన నేనే పోవుదును.

సీత :- ఆర్యపుత్ర ! నే నేమిచేయవలెను ?

రాము :- స్వామికి సేవ చేయుచుండుము.

సీత :- చిత్తము.

[రాముడు నిష్క్రమించును]

రావ :- అదిగో అర్ఘ్యమును గొని రాము డేగుచున్నాడు. పూజను సరకుసేయక యరుగు లేడిపై వి ల్లెక్కిడుచున్నాడు రాముడు.

ఎంతబల! మెంత శూరత ! యెంతశక్తి!
ఎంత వేగ మ్మహో ! యబ్ర మెంచి చూడ
రామ యను రెండె యక్కరా లేమిమహిమొ
నిఖిలజగము న యందును నిండె నహాహ ?

అదిగో ! మృగము ఒక్కగంతులో బాణమున కందక యరణ్యముఁ బ్రవేశించినది.

సీత :- (తనలో) ఆర్యపుత్రుని విడుచుటచే నా కేమో భయ
మగు చున్నది.

రావ :- (తనలో)

మాయచే రాము డిట కనుమాటుగాగ
నీ తపోవనభూమిని నింతలోన
యేమ్చు నేకాకి నీ బాల నెత్తుకొనుచు
పోదు నాహుతి మంత్రవిముక్త నట్లు.

సీత :- పర్ణశాలలోని కేగుదును. (పో బోవును)

రావ :- (నిజరూపముతో) సీతా! నిలుము. నిలుము సీతా!

సీత :- (భయముతో) హా! ఎవ్వ డీతడు?

రావ :- తెలియవా నన్ను-

దురమున దేవదానవుల
దూల్చితి, నింద్రుని గెల్చినాడ, దు
ర్భర మగు సోదరీముఖవి
లక్షణతం గనినాడ వింటి సో
దరమృతి, నిన్ను దో కొనగ
దర్పదురాత్ము నసాధ్యు రాము మా
యరతి భ్రమంబు వెట్టితి సి
తాబ్జవిలోచన! రావణుండ నే!

సీత :- అయ్యో! రావణుడా! (పో బోవును)

రావ :- రావణుకన్నుల బడి యెచటికి బోగలవు?

సీత :- ఆర్యపుత్రా! రక్షింపుము, రక్షింపుము. లక్ష్మణా!
రక్షింపుము, రక్షింపుము.

రావ :- సీతా! విను నా శౌర్యసాహసములు.

పరచె సురేంద్రు, డర్థపతి
ప్రాణము పోయినయట్లు తూలె, ని
ష్కారుణను లాగగాబడియె
జంద్రుడు, తన్నుల నొందె గాలుడున్
బరువుదొరంగి భీతు లగు
స్వర్గనివాసులతోడి స్వర్గరా
జ్యరమ కృశించె, నిద్ధరణి
తన్మాసుత యుంటను ధన్యయయ్యెబో!

సీత :- ఆర్యపుత్రా! రక్షింపుము, రక్షింపుము. లక్ష్మణా! రక్షింపుము, రక్షింపుము.

రావ :-శరణు రాముని వేడు, లక్ష్మణుని వేడు
స్వర్గ మందలి దశరథప్రభుని వేడు
మేమి యగు కాపురుషపల్కు లెన్ని యైన?
హారిణశిశువుల బెబ్బులి సరకుగొనునె.

సీత :- ఆర్యపుత్రా! రక్షింపుము, రక్షింపుము, లక్ష్మణా! రక్షింపుము, రక్షింపుము.

రావ :- ఓసి! యాయతనేత్ర! యాయాసపడకు
నీదుపతిగను నన్ను గణించుకొమ్మ
అఖిలబలవత్సురానీకమండ యైన
పరమునం దోర్వ రాముని తరమె నన్ను.

సీత :-(రోషముతో) శపింతును.

రావ :—స్వగతము. అహా! పతివ్రతా ప్రభావము!

జపముతో గతవిధి నే జనియు నింత
కాల్పఁబడలేదు భాస్కరుకాంతి తతిని
నొక్క శాపమియ్యఁడ నను నాగ్ని యక్కటముల
సీతచే గాల్పఁబడినాఁడ నేమి మహిమొ?

సీత :—ఆర్యపుత్రా! రక్షింపుము.

రావ :—(సీతను జేకొని) జనస్థాననివాసు లగు తపస్వులారా! వినుఁడు, వినుఁడు.

బలవంతమ్ముగ రావణుఁ
డిలసుత గొని యేగుచుండె నెఱుఁగుఁడు మీరల్
కలిగినక్షాత్రమునం బ్రియ
మెలమిని మీ రాముశౌర్య మెదిరించుననుఁ.

సీత :—ఆర్యపుత్రా! రక్షింపుము. రక్షింపుము.

రావ :—(ముందునకు బోయి పరికించి చూచి) అహో! రెక్కల పెనుగాలితాకున కకావికలైనవి వనసమూహములు! ఇదే జటాయువు వాఁడి యౌ చంచువుతో నిటే వచ్చుచున్నాఁడు. అరే! నిలువుము!

కాచుకొమ్మర నా చేతిఖడ్గనిహతి
నీదు రెక్కల నఱకుదు నెత్తు రురల
గాయముల గారు నెత్తుటఁ గాయ మలర
నంపుదును నిన్ను యమునింటి కతిథిగాను.

(నిష్క్రమించును)

పంచమాంకము సమాప్తము.

ప్రతిమ

షష్ఠాంకము

(ఇద్దరు ముసలితాపసులు ప్రవేశింతురు.)

ఇద్దరు:-రక్షింపుడు. రక్షింపుడు.

మొద :—

నల్లకలువలదండచందమ్ము ఛాయ
తమ్మితూడటు తెల్లదంతాలనవ్వు
కల్గు రాత్రించరుడు దశకంఠుచేత
సీత మృగివోలె గొనబడు సిగ్గు జెంది.

రెండు :-ఈమెయే కదా పూజ్యురాలైన జానకి.

చేష్ట లుడిగిన పాపరాచెలివితాన
కంప మొందెడు పూదీవకరణి సీత
పాపి దశకంఠుచే తపఃఫలము నట్లు
లపహరింపగబడు చుండె నతిరయమున.

ఇద్దరు :-రక్షింపుడు. రక్షింపుడు.

మొద:-(పైకి జూచి) అను చుండగనే దశరథుఋణ మీగ నే నుండగ నీ వెక్కడి కేగగల వనుచు రావణుని పలికి నింగిపై కెగిరెగా జటాయువు.

[illegible] :- [illegible]! [illegible] కన్ను [illegible] [illegible] [illegible] [illegible].

[illegible]:- [illegible] [illegible].

[illegible] :- [illegible] జటాయువు.

ఇద్దరు :-అరె! ఆకాశముననే యుద్ధము సాగినదే.

మొ :-కాశ్యప! కాశ్యప! చూడు క్రవ్యాదేశ్వరు డైన జటాయు సాహసకృత్యము.

రెక్కలబల్మి నెత్తి శిచి
రెక్కొనె ఘరత జంటపోరుకై
రక్కసుముక్కులం గొనగ
రక్కను వాడిగ గట్టిగా స్థిరం
డక్కను నిస్ప గోపుల మ
హాంతరము న్గాని చీల్చువజ్రిపు
న్మక్కల కొండరాళ్లు తెగి
పోవునటుల్ విమానంపు ముక్కలై.

రెండ :- రావణుడు కోపించి కత్తిచే జటాయువు కుడిరెక్కను నరికినాడు.

ఇద్ద :- అయ్యో! పూజ్య జటాయువు పడిపోయినాడు.

ప్రథ :- ఎంతకష్టము! ఈతడే పూజ్యు డైన జటాయువు—

తనదుశక్తికి మించు యత్నమ్ము చేసి
ఆటనెమిలి న ట్లరి నలత్యమ్ము చేసి

రక్కసులఁజేని తేజమ్ము నుక్కడంచి
కడకు వనగజభగ్నవృక్షమ్ము నయ్యె.

శిష్య :- వీనికి స్వర్గము కల్గుగాత !

మొ :- కాశ్యప ! పోదమా ? ఈ వృత్తాంతము పూజ్యులైన రాఘవులకు నివేదింతము.

రెం :- బాగు ! మంచియూహ.

(నిష్క్రమింతురు)

(విష్కంభకము)

(తరువాత కంచుకి ప్రవేశము)

కంచు :- ఎవ రక్కడ ? కాంచన తోరణద్వారమును రక్షించువారు ?

ప్రతీ :- (ప్రవేశించి) అయ్యా ! నేను విజయను. ఏమి చేయవలె ?

కంచు :- విజయా ! భరతకుమారునకు నివేదింపవలెను. అడుగో రామదర్శనమునకై జనస్థానమునకు బోయి వచ్చిన సుమంత్రుడు.

ప్రతీ :- అయ్యా ! సఫలులై యే వచ్చిరా తాత సుమంత్రులు ?

కంచు :- తెలియదమ్మా,

హృదయ మందున దుఃఖాగ్ని యొరియు చుంట
వాడువారిన మోముతో వచ్చువాని
కాంచుచుండగనే మది కనలె నాకు
ఏమి యయ్యెనో తెల్పగా నెట్టు లమ్మ.

[illegible] :– [illegible] నా మనసును కలవరపఱచిన ట్లున్నది.

[illegible] :– [illegible] తపస్విజనవృత్తి [illegible]ము.

ప్రతి :– [illegible] ఇదిగో విన్నవింతును. (నిష్క్రమించును)

కంచు :– (చూచి) అహా! అదిగో పూజ్యభరత కుమారుడు. సుమంత్రుని రాకచే కుతూహలహృదయుడై, నారలు ధరించి విచిత్రమైన జటాపుంజ పింజరితమైన ఉత్తమాంగముతో నిటే వచ్చుచున్నాడు.

వరసుగుణాళికిన్ మనికి
పట్టు విరోధులపాలికాలుడున్,
సురపతి సన్నిభుండు నుత
సూర్యకులాలయ దీపకుండు, ని
ద్ధరణి భరమ్ము సర్వమును
దాల్చెడివా డిటు లన్నయాన, ను
ద్ధురకలభేభగామి, సిరి
తోరపుమూర్తి యుదారవర్తి తాన్ .

(తరువాత భరతుడు ప్రతీహారియు ప్రవేశము)

భర :– విజయా! ఇట్లు పూజ్య సుమంత్రులు మరలివచ్చిరా!

అన్నప్రసాదలబ్ధి శప
థాప్తి జెలంగి యయోధ్యరాగ నే
మున్ను గనంగ రాఘవుని
పూజ్యసుమంత్రుడు వోయి వచ్చెనే

కన్నుల గాంచివచ్చె నొకో
కమ్మని స్వామిని, లోకనేత్ర సం
పన్నమనోభిరాము బితృ
వాక్పరిపాలనకాము, రామునిన్.

కంచు :– (సమీపించి) జయము కుమారునకు !

భర :– ఇప్పు డెచ్చట నున్నాడు సుమంత్రుడు ?

కంచు :– అదే కాంచనతోరణ ద్వారమున.

భర :– అయిన వెంటనే ప్రవేశపెట్టుము.

కంచు :– చిత్తము (నిష్క్రమించును)

(సుమంత్రుడు, ప్రతీహారియు ప్రవేశము)

సుమం :– (దుఃఖముతో) అయ్యో! కష్టము. కష్టము.
అధిపుమరణమ్ము గంటి బ్రత్యక్షముగను
రాచకొమరుని దుస్థితి జూచినాడు
వింటి జానకినాశమ్ము మంటి నింక
చిరము మనుటయె గుణమున జేటు గూర్చె.

ప్రతీ :– (సుమంత్రునితో) దయచేయుడు దయచేయుడు.
వారే ప్రభువులు. అయ్యా! సమీపింపుడు.

సుమం :– (సమీపించి) జయము కుమార !

భర :– తాత ! లోక విదితపితృభక్తిపరుడు రామచంద్రుడు
నీకు కనబడెనా? పూజ్యురాలైన అపరారుంధతిని

[illegible] [illegible] [illegible] వాస లాలస సౌభ్రాతృని
[illegible]!

([illegible] [illegible] ప్రవేశించును)

ప్రతీ :– మహారాజపుత్రులు తమ్ము నడుగుచున్నారు.

సుమం :– అమ్మాయి! ఏమి? నన్నా?

భర :– (తనలో) మిక్కిలి బాధపడుచున్నాడే దుఃఖోద్వేగమున శూన్యహృదయుడు నగుచున్నాడు (ప్రకాశముగ) మార్గమధ్యము నుండియే తిరిగి వచ్చితిరా మీరు ?

సుమం :–నాయనా! నీయాజ్ఞను రాముని జూడ జనస్థానమునకు బోతినిగదా! ఎట్లు మార్గమధ్యమునుండి రాగలను ?

భర :–క్రోధమునగాని, సిగ్గుచేగాని, దర్శన మీయలేదా అన్నగారు!

సుమం :–నాయనా!

> నిగ్రహాత్ముల కెటు లుండు నాగ్రహమ్ము
> సిద్ధ సంకల్పులకు నెట్లు సిగ్గుకల్గు
> ఎంత దౌర్భాగ్యుడనో యేమొ యేను దెలియ
> వారుమువ్వురు లేనట్టి వనము గంటి.

భర :–ఆ! శూన్యవనమును గంటిరా! ఎక్కడకు పోయిరని వింటిరి?

సుమం :–కిష్కింధ యను వానరనివాస మున్నదికదా! అచటికి బోయి యుందు రని వినికి.

భర :-అయ్యో ! వానరు లజ్ఞులు. పురుషవిశేషము లెరుగరు, కాన కష్టముల గుడుచు చుందురు కాబోలు.

సుమం:- నాయనా ! జంతువులకు గూడ కృతజ్ఞత యుండును.

భర :-తాత ! ఎట్లు ?

సుమం:—

అన్న యగు వాలిదుర్వృత్తి నవనిరాజ్య
మునకు ద్రోలగెను సుగ్రీవు డనఘు డకట !
ఆలి హరియింప దుఃఖాన నగము నందు
నుండి సమదుఃఖుచే మోక్ష మొందె దుదకు.

భర:-తాత ! సమదుఃఖునిచే ననగా ?

సుమం :- (తనలో) అయ్యో ! అంతయు చెప్పివేసితినే ! (ప్రకాశముగా) ఏమియు లేదు నాయనా ! సర్వసంపదలు తొలుగుటచే సమదుఃఖు డంటిని. ఇదియే నా భావము.

భర :-తాత ! దాచు చుంటివా ! నిజము చెప్ప కుంటివా ! దివంగతు లైన మహారాజుగారి పాదములపై నాన.

సుమం:-ఏమిగతి వినుము !

సంయమీంద్రుల రక్షించు క్షణము నుండి
కఠినవైరము పూనె రాక్షసగణమ్ము
మాయ కల్పించి రాముని మాటుపఱచి
సీత హరియించె రావణపాతకుండు .

భర :-ఏమి ? హరించెనా ! హా ! (మూర్ఛ)

సుమం :- నక్షత్రము ! నక్షత్రము.

భర :- [illegible] నక్షత్రము !

జనకసుతను [illegible] వీడ వనము లోను
[illegible] నటను టించి
[illegible] మేఘమ్ము వెలగ
[illegible] కాంతి యయ్యె.

అయ్యో ! ఇప్పు డేమి చేయుదును. తెలిసినది తాత !
నాతో [illegible] నమ్ము.

సుమం:- చిత్తము. అట్లే !

(ఇరువురు నిష్క్రమింతురు)

సుమం :- నాయనా! పోవలదు. పోవలదు. దేవులచతుశ్శాల యిది.

భర :- ఇక్కడనే నాకు పని. ఎవ రక్కడ ప్రతీహారులు ?

(ప్రతీహారి ప్రవేశించును)

ప్రతీ :- జయము మహారాజకుమార ! నేను విజయను.

భర :- విజయా ! నా రాకను జననికి దెల్పుము.

ప్రతీ :- దేవులలో నేరికి తెలుపుదును.

భర :- ఏమె నేను రాజు కాగోరుచున్నదో ఆమెకు.

ప్రతీ :- (తనలో) అయ్యో ! ఏమిజరుగునో ! (ప్రకాశము) స్వామీ అట్లే (పోవును)

(తరువాత కైక ప్రతీహారి ప్రవేశము)

కైక :— విజయా! నన్ను జూచుటకు చిరంజీవి వచ్చెనా?

ప్రతీ :— అవునమ్మా! మహారాజకుమారులు రామచంద్రుల యొద్ద నుండి సుమంత్రులు వచ్చిరి. అందుచే భరతులు మిమ్ము చూడ నిచ్చగించు చున్నారు కావలయు.

కైక :— (తనలో) ఏ ప్రస్తావమున నన్ను నిందించునో?

ప్రతీ :— రాకుమారుల ప్రవేశ పెట్టు నుందురా!

కైక :— పోమ్ము! ప్రవేశ పెట్టుము.

ప్రతీ :— చిత్తము (పోయి సమీపించి) జయము రాకుమార దయచేయుడు

భర :— విజయా! విన్నవించితివా?

ప్రతీ :— చిత్తము.

భర :— అయిన ప్రవేశింతము. (ప్రవేశించును)

కైక :— బిడ్డా. రాముని యొద్ద నుండి సుమంత్రులు వచ్చిరని విజయ తెల్పినది.

భర :— పూజ్యురాలికి నంతకంటె ప్రియము తెల్పుదును.

కైక:— బిడ్డా! అయిన కౌసల్యాసుమిత్రులు కూడ వినదగిన వారలే.

భర :— వలదు. వారు వినగూడదు.

కైక :— (తనలో) అయ్యో! ఏమై యుండవచ్చును? (ప్రకాశముగా) చెప్పుము నాయనా!

భర :- వినుము.

> జనకు రాజ్యమ్ము వీడి కాననములకును
> జనకుని మాన బోయెనో యిద్ధచరితు
> శత్రు యాతని భార్య తా నపహరింప
> బడియె నీ కోర్కె తీర్పగా బడెనొ లేదొ.

కైక :- అయ్యో!

భర :- అకట సత్యాశ్య లిక్ష్వాకు లనఘమతులు
> వారి కులవధూహరణమ్ము ప్రాప్త మయ్యె
> నిట్టికోడలు ప్రాప్తించు నట్టికతన
> నేమి జరుగుట యబ్బిమ్ము భూమి నింక.

కైక :- (తనలో) కానిమ్ము. ఇదియే చెప్పదగిన కాలము. (ప్రకాశముగా) బిడ్డా! మహారాజుగారి శాపవృత్తాంతము నీ వెరుగవు కాబోలు.

భర :- ఏమి మహారాజుగారికి శాపమా!

కైక :- సుమంత్రి! సవిస్తరముగా దెల్పుము.

సుమం :- అట్టులే నమ్మా! నాయనా వినుము-పూర్వము వేటబోయిన మహారాజు ఒకానొక కొలనిలో అడవి యేనుగు నీరు త్రాగుశబ్దము వంటి శబ్దము వినెను. అది వనగజ మనుకొని శబ్దవేధిబాణముచే నొకముని కుమారుని కొట్టెను. అత డొక గ్రుడ్డిముసలిమునికి కన్నైనకొడుకు. అంత నాత డసువులు విడిచె.

భర :- అసువులు విడిచెనా? పాపము శమించుగాక! పాపము శమించుగాక! తరువాత :

సుమం :- అ ట్లైన యాతని జూచి—

సత్యభామను డై నట్టి సంయమీంద్రు
డేడ్చి యేడ్చియు తుదకు తా నిట్టు లనియె
'ఎట్టు లే నైతి నట్టులే యీవు గూడ
పుత్రశోకార్తి జత్తువు పొమ్ము రాజ! — అని

భర :- అబ్బా! ఎంత కష్టము :

కైక :- నాయనా : ఈ కారణమున పాపము నాపై బడె బిడ్డ గానకు బంపబడెను. అంతియేగాని రాజ్యలోభమునగాదు. దుస్తరముగదా మహర్షిశాపము! అనుభవింపక తప్పదు. కొమరు డడవికి పోక యెట్లగును?

భర :- అయిన నే నేగినను నంతియేగదా! న న్నేల పంపలేదు?

కైక :- బిడ్డా! మామయింట సుదూర దేశమున నుంట నీవు సహజముగా విప్రవాసమున నే యుంటివి.

భర :- అయిన పదునాల్గేం డ్లేల చెప్పబడెను?

కైక :- నాయనా! పదునాల్గుదినము లని యనబోయి కలతచే పదునాల్గేం డ్లంటిని.

భర :- ఆహా! ఎంత తెలివి! సమాధానము బాగుగా నాలోచించితివి. ఇది పెద్దల కందఱికిని తెలియును. వారికి సమ్మతముకూడ.

భర :- అయ్యో! మీరు ముల్లోకములకు సాక్షులుకదా! భాగ్యవశమున మా యమ్మ నిరపరాధ, అమ్మా! సోదరప్రేమచే కోపమున నే నే మేమి దూషించితి నన్నియు క్షమింపుము. అమ్మా నమస్కారము.

కైక :-అక్కా ! నీ తల్లి కన్నబిడ్డనా సుగుల మన్నింపదు
నారాయణా ! అమ్మా ! ఇందు ద్రోహ మే మున్నది.

భర :-అనుగ్రహింప జనితవని, సెలవు. ఇప్పుడే అన్నసహా
యార్థము శత్రుఘ్నునకు సంతను సమకూర్చెదను.
ఇప్పుడే నేను.

ఈ యమదళారూఢ వేల నిపు
డే వృషమపై నిశవాస బద్ధగా
జేయుదు నైకమత్త్రవర
సింధుర కాలమహాంధకారగా
జేయుదు వాహినీగణము
చే నిటువార్నిధి, రావణుండటుల్
దాయము నొందియేపజన
దల్పుదు, శాత్రవము రూపుమాపుదున్.

ఇది యేదో ధ్వని ! అది యేమో తెలియుము.

ప్రతీ :-(ప్రవేశించి) జయముకుమారా ! ఈవిషయము విని
పెద్దరాణిగారు మూర్ఛమునిగిరి.

కైక :-అయ్యో !

భర :-ఏమి మూర్ఛవోయెనా ? అయ్యో !

కైక :-నారాయనా ! పూజ్యురాలి నూరడింతము.

భర :-అమ్మా ! అటులనే.

(అందరు నిష్క్రమింతురు)

(షష్ఠాంకము సమాప్తము)

ప్రతిమ

సప్తమాంకము

(తరువాత నొక జడదారి ప్రవేశము)

తాప :–నందిలక ! నందిలక !

నంది :– (ప్రవేశించి) అయ్యా ! వచ్చుచున్నాను.

తాప :–నందిలక ! కులపతి తెల్పుచున్నాడు. నిజభార్య నపహరించిన లోకకంటకు దశకంఠు నాశముచేసి రాక్షసగణమునకు విరుద్ధమైన ప్రవర్తన గల సుగుణ గణభూషణు విభీషణునకు పట్టము గట్టి యఖిలలోక పవిత్రచరిత్ర యగు పూజ్యజనక పుత్రిని గొని ఋక్ష రాక్షసవానరముఖ్యులతో పరివేష్టింప బడిన శారద స్వచ్ఛ గగన చంద్రాభిరాముడు రాముడు వచ్చుచున్నాడు. కాన మన కున్నంత వైభవముతో సర్వ శోభనముగా మన ఆశ్రమమున స్వామి కాహ్వాన మీయవలె నని.

నంది :– అయ్యా ! అంతయు సిద్ధముగనే యున్నది. కాని—

తాప :–ఏ మది ?

[illegible] ఉన్నారుగదా!
[illegible] విషయము [illegible] చూచుకొనవలెను.

రావ :- [illegible] ?

నంది:-వారు మాంసాశనులు గదా!

రావ :-భయపడకు! శ్రీరామాజ్ఞాబద్ధులు గదా రాక్షసులు.

నంది :- రాక్షససజ్జనులకు నమస్సులు.

రావ :- (చూచి) ఆహా! ఇదుగో పూజ్యరామచంద్రులు

జయము నరవరా! నీ శత్రు ద్రోహం దున్న నోర్దుక
నయమున ధర యెల్లన్ నమ్రమా నీదునానన్,
జయ మనుచు ననేకుల్ సన్మునీంద్రుల్ నుతింపన్,
అయ మటు లిల రాముం డా విమానంబు డిగ్గున్.

జయముస్వామీ! జయము. (నిష్క్రమించును)

(మిశ్రవిష్కంభకము)

(తరువాత రాముడుప్రవేశించును)

రాము :- వినుతినెసంగు బాహుబల
వీర్యుని రావణు జంపి విశ్వ స
ద్గుణఖని జానకీరమణి
గొంటి వినిర్మలశీలనుం బ్రియం
బున గురుపాదు లన్న నుడి
పూర్తి యొనర్చితి భక్తిపెంపునన్
మునిజనవాస మిప్పగిది
పొందితి కౌతుక మొప్ప నేటికిన్.

హాని సతులకు నమస్కరింప లోని కరిగి జానకి కడు
తడ వైనదే (చూచి) అదిగో! వైదేహి—

ప్రాయ సముచితరీతి తాపసీగణమ్ము
పిలుచుచుండిరి పేర్మి మై చెలియ! సీత!
జానకీ! కోడలా! యని, జనకదుహిత
మెల్లమెల్లగ వినుచు దా నల్లవచ్చు.

(తరువాత సీత, తాపసియు ప్రవేశము)

తాప :— చెలీ! ఇదుగో నీ భర్త! సమీపింపుము. ఏకాకినిగా
నిన్ను జూడలేను.

సీత :— ఆహా! ఇప్పటికిని నమ్మతగ నట్టు లున్నది నా పరి
స్థితి (సమీపించి) జయ మార్యపుత్రులకు!

రాముం :— మైథిలి! మున్ను మన మున్న జనస్థానము నెఱు
గుదువా! అందు బిడ్డలమాదిరి పెంచితివే వృక్షములను
గుర్తున్నదా.

సీత :— గుర్తించు చున్నాను, అప్పుడు చిన్న యాకులతో
లేతతనమున నున్నవి. ఇప్పుడు పరివృద్ధము లై
యాకులు కొమ్మలతో నిండిన వైనవి.

రాము :— అవు నవును, కాలమే కదా నిమ్నోన్నతముల
కలిగించునది! మైథిలీ! ఈ సప్తపర్ణవృక్షములక్రింద
తెల్లని బట్టలు కట్టుకొనిన భరతుని జూచి మృగకులము
వ్యాకులమైనది, జ్ఞప్తి యందున్నదా?

సీత :— ఆర్యపుత్రా! గట్టిగా గుర్తున్నది.

రాము :- ఇది [illegible] తపమ్మునకు [illegible] మగు మహా [illegible]ము. ఇచటనే మనము [illegible] తాతపాదులకు [illegible]ము చేయ దలచుచుండ కాంచనపార్శ్వ మను మృగము [illegible]నది.

సీత :- ఆ. ఆర్యపుత్రా! చెప్పకుము. చెప్పకు మింక.

(భయముతో కంపించును)

రాము :- భయపడకు! ఆ కాలము గడిచిపోయినది గదా! ఇంక భయ మేల? (నలుగడలు పరికించి) ఆహా!

రేగుచు నెల్ల తెల్లనగు
   రేకువ బొద్దుగుపూలసాటియై
మూగుచు నుండె దిక్కులకు
   మూలలకున్ పవనావఘూతమై
నాగరలక్షణంబున క
   నంబడు డప్పుల పెద్దమోతచే
బాగుగ నీవనమ్ము పరి
   వర్ధితశంఖ నినాద సంగతిన్

లక్ష్మ :- (ప్రవేశించి) ఆర్యులకు జయము, ఆర్య!
భ్రాతృ గౌరవ పూర్ణుడౌ భరతుడడుగో!
అమ్మలును పెద్ద వాహిని యనుసరింప
మిమ్ము కనుగొను నాత్రమ్ము ముమ్మరింప
నతడె వచ్చుచు నుండెనో యనఘ! కనుమ.

రాము :- నాయనా! లక్ష్మణా! భరతుడువచ్చెనా?

లక్ష్మ :- చిత్తము.

రాము :- మైథిలి! పూజ్యురాండ్రైన అత్తలను చిరంజీవి భరతుని జూడ కనులను పెద్దవి చేసికొనుము.

సీత :- ఆర్యపుత్ర! వాంఛించుచుండగనే వచ్చెనే భరతుడు!

(తరువాత భరతుడు ప్రవేశము)

భర :- అట్టి మహావిపత్కరము
లా బలవత్తర కష్టఘట్టముల్
నెట్టనవీడె, చంద్రముని
నీరదమాల శరత్తు నంబలెన్
ఇట్టులు తృప్తమానసుడ
నెల్లరు బంధులు నాప్తవర్గమున్
చుట్టుచురాగ వచ్చితిని
చూడగ నార్యుని నార్యతో నిటన్.

ఆహా! ధన్యుడను.

రాము :- అమ్మలకు వందనము.

తల్లులందఱు :- బిడ్డా! చిరంజీవివి కమ్ము! ప్రతిజ్ఞాపాలనము చేసి భార్యాద్వితీయుడవైన నిన్ను జూచుభాగ్యమున వర్థిల్లుచున్నాము.

రాము :- అనుగ్రహింపబడితిని.

లక్ష్మ :- అమ్మలకు నమస్సులు.

అందఱు :- బిడ్డా! చిరంజీవివి కమ్ము.

లక్ష్మ :- అనుగ్రహింప బడితిని.

సీత :- [illegible] వందనములు.

[illegible] :- అమ్మా! నిత్యసుమంగలివి కమ్ము.

సీత :-అనుగ్రహింపబడితిని.

భర :- అమ్మా! భరతుడు నమస్కరించుచున్నాడు.

రాము :- రమ్ము నాయనా! ఇక్ష్వాకుకుమార! రమ్ము! స్వస్తి! చిరంజీవివి కమ్ము.

రమ్ము కవాటతుల్యము ను
రమ్ము నురమ్మున జేర్చు మయ్య యం
దిమ్ముగ కౌగిలింప భవ
దీయ సుదీర్ఘ భుజద్వయమ్ము నూ
ర్ధ్వ మ్మొనరింపు కొంచెము శ
రచ్ఛశిసన్నిభమైన నీదు వ
క్త్రమ్మును పోయిగూర్పగదె!
కాయము దీనిని దుఃఖదగ్ధముగా.

భర :- అనుగ్రహింపబడితిని. అమ్మా! భరతుని నమస్కారము లివిగో.

సీత :- చిర మార్యపుత్రుని సహవాసివై యుండుము.

భర :- అనుగ్రహింపబడితిని. ఆర్య! నమస్కారము.

లక్ష్మ :- రమ్ము నాయనా! రమ్ము. దీర్ఘాయుష్మంతుడవు కమ్ము! గట్టిగా కౌగిలింపుము.

(ఆలింగనము చేయును)

భర :- ధన్యుడను ఆర్యా! రాజ్యభారము చేకొనుడు.
రాము :- బిడ్డా! ఎట్లు?
కైక :- బిడ్డా! చాల కాలముగా నాశించి యున్నదే గదా.

(శత్రుఘ్నుడు ప్రవేశము)

శత్రు :- పలు నిడుమలు వడె నోడుదుడు
కుల సుఖదము తేజ మలర గుణగణ మొప్పగ
కులతిలకు గురుని రాక్షస
కుల నాశకు చూడ మదిని కుతుక మ్మొలయగ.

(సమీపించి) ఆర్య! శత్రుఘ్నుడు నమస్కరించు చున్నాడు.

రాము :- రమ్ము నాయనా! రమ్ము. స్వస్తి చిరంజీవివికమ్ము.
శత్రు :- అనుగ్రహింప బడితిని. అమ్మా! నమస్కారము.
సీత :- బిడ్డా! చిరంజీవివి కమ్ము.
శత్రు :- అనుగ్రహింపబడితిని. అన్నా! నమస్కారము.
లక్ష్మ :- శుభ మగుగాక! ఆయుష్మంతుడవు కమ్ము.
శత్రు :- అనుగ్రహింపబడితిని. అన్నా! అరుగో! వసిష్ఠ వామదేవులు మంత్రులతో కలిసి పట్టాభిషేకమునకై మిమ్ము దర్శింప గోరుచున్నారు.

స్వయము నానానదీనదజలము గొనుచు
మునులు వచ్చిరి, మీదయం గన దలంత్రు
సలిలసంసిక్తవారిజ సదృశమైన
ప్రథమ మభిషిక్తమౌ మీదు వదన మనఘ!

కైక :- బిడ్డా! రమ్ము. స్వీకరింపు మభిషేకమును.

రాము :- అమ్మ! యాజ్ఞ (నిష్క్రమించును)

(తెరలో)

జయము జయము స్వామీ! జయము మహారాజు
లకు. జయము దేవా! జయము భద్రముఖులకు. జయ
రావణాంతకులకు. జయము జయము జయము.

కైక :- వీరే పురోహితులు. కంచుకులు. వీరు నా బిడ్డ
కాశీర్వాదములను విజయఘోషములను పల్కుచు
సమ్మానించు చున్నారు.

సుమి :- మంత్రులు సేవకులు సజ్జనులు నా బిడ్డకు విజయ
మభివృద్ధి చేయుచున్నారు.

(తెరలో)

ఓహో! జనస్థాన వాసులైన తాపసులారా! వినుడు.
వినుడు మీరలు.

దినమణి యంధ కారమటు
  దీపిత శౌర్య మయూఖ పంక్తులన్
ఘన దురితారి సంజనిత
  గాఢ తమిస్రము రూపుమాపి, యా
జనకుని పట్టి, సర్వశుభ
  సంపద కాకరమైన సాధ్వి, చే
కొని, యిటు వచ్చె రాము, జయ
  కొట్టుడు సర్వజనాభి రామునికా

కైక :- ఆహా ! నా బిడ్డ విజయ ఘోషము మిన్ను ముట్టు
చున్నది.

(తరువాత సపరివారుడై యభిషిక్తుడైన రాముడు ప్రవేశించును.)

రాము :- (ఆకసముజూచి) ఓ తండ్రీ !

నాకమునందు నున్న జన
నాయక ! సంతసమందు, దీనతన్
బోకుము, నీ హితంపు పని
బూని యొనర్చితి కోరినట్లుగా,
చే కొని రాజ్యభారమును,
చేసె దనంటిని ధర్మరక్షు, లో
కైక హితుండ నై ధరకు
నేలిక నైతిని, శాంతి నొందుమా !

భర :- నరపతి యన్న శబ్దము గ
నంబడి, పూని పితాత పత్రిమున్
ధరవర తీర్థవారి ఘన
తన్నభిషేకము నొంది మౌళి, సుం
దరతరమై యెసంగు జన
తా వినుతాత్మవిలాస భాసితున్
గురు నవచంద్ర సన్నిభు గ
నుం గొన లేదిట దృష్టి యెంతకున్.

శత్రు :- చంద్రునుదయాన భాసించు జగము నట్లు
కలుషము వోయి మరల తా శాంతిచెవన్నా.

[illegible] రాము
[illegible]

రాము:-ధన్యు లమ్మా! రాజునైతిని.

లక్ష్మ:-భాగ్యము పండినది.

కంచు:-(ప్రవేశించి) మహారాజులకు జయము. పూజ్యుడైన విభీషణుడు విన్నవించుచున్నాడు. సుగ్రీవ, నీల, మైంద, జాంబవదాంజనేయులాదిగ గల వారలెల్లరు విన్నవించు చున్నారు. 'దైవ కృపచేస్వామి వర్ధిల్లు చున్నారని.

రాము:- మీ యందఱి సాయమున నదృష్టము గంటినని తెల్పుము.

కంచు :-చిత్తము, మహాప్రభూ!

కైక :-ధన్యనైతిని. ఈయుత్సవము నయోధ్యలో చూడ గోరుదును.

రాము:-అటులనే అమ్మా! (చూచి) అహో! ఈవనము కాంతులచే భాస్కర బింబమట్లలరారు చున్నదే. (ఆలోచించి) ఆ! తెలిసినది! రావణు విమానము పుష్పకమాకసమునకు వచ్చినది. తలచుకొనగనే వచ్చునట్లు బాస చేయబడినదిగదా! కాన దాని నందఱు నెక్కుడు.

(అందఱు నెక్కుదురు)

రాము:—

బంధుమిత్రులు హితులు నాపజ్జరాగ
నిప్పుడే పోగల నయోధ్య కెగిరి నింగి.

లక్ష్మి:—

ఉదయగిరి [illegible] రామమూర్తి [illegible]
పాలించుచున్న [illegible] పట్టి [illegible]

(భరత వాక్యము)

బంధుమిత్రులతో ధర్మపత్నితోడ
రాముడెట్టులు పాలించె రాజ్యలక్ష్మి
నటులె సిరియును ధర్మమ్ము నభిగమించి
రాజుపాలించుగాత! భూరాజ్యమింక.

(అందరూ నిష్క్రమింతురు)

(సప్తమాంకము సమాప్తము)